నేటి కందం- నేటికి అందం

జనవంద్యుండు కొలంబసు
కనుగొని యానమున తనదు కన్నులతో-కే
మెను ద్వీపమ్మును-సంతస
మును బొందుచు తన ప్రయాణ మును సాగించెన్ !!

(10-5-1503 కొలంబస్
కేమన్ ద్వీపాన్ని కనుక్కున్న రోజు)

-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

ఉన్మాదపు యుద్ధజ్వాల
ఉరుకుల్లో పాక్ నేడు
శాంతినంతా విధ్వంసం
చేస్తు మార్చె దాన్ని మోడు
భారత్ పై గెలుస్తామని
భ్రమపడుతూ కలగంటే
అమాయక జన ప్రాణం
ఆహుతే యుద్ధమంటే

-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 10-5-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:222 పేజీలు:6 వెల: రూ.1/-

# 400 డ్రోన్లతో పాక్ దాడి.. అన్నింటినీ కూల్చేసిన భారత సైన్యం

న్యూఢిల్లీ, మే 9:భారత్‌పై దాడికి పాక్ సైన్యం టర్కీ తయారీ డ్రోన్లను ప్రయోగించిందని సైనికాధికారులు శుక్రవారం వెల్లడించారు. భారత్‌లోని సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని గురువారం రాత్రి పాకిస్థాన్ డ్రోన్ దాడులకు తెగబడిన సంగతి తెలిసిందే. జమ్ములోని లేహ్ నుంచి గుజరాత్‌లోని సర్‌క్రీక్ వరకు 36 కీలక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకొని సుమారు 400 డ్రోన్లతో పాక్ దాడికి పాల్పడినట్టు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికాసింగ్ వివరించారు. పౌర విమానాలను కవచంగా మార్చుకొని, వాటి మాటున వైమానిక దాడులకు పాల్పడిందని తెలిపారు. భారత్‌లో కూలిన ఆ డ్రోన్ల శిథిలాలను పరిశీలించినప్పుడు అవి టర్కీలో తయారైన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' మాడల్ డ్రోన్లని వెల్లడైందని తెలిపారు.

పాక్ సైన్యం గురువారం రాత్రి దేశ పశ్చిమ సరిహద్దు వైపు అనేకమార్లు మన గగనతలాన్ని ఉల్లంఘించిందని వ్యోమికాసింగ్ చెప్పారు. మరోవైపు నియంత్రణ రేఖ వెంబడి భారీ ఆయుధాలతో కాల్పులు జరిపిందని తెలిపారు. తొలుత పాక్‌కు చెందిన నిరాయుధ డ్రోన్ భటిండా మిలిటరీ స్టేషన్‌వైపు వచ్చిందని, దానిని గుర్తించిన సైన్యం వెంటనే కూల్చివేసిందని చెప్పారు. ఉభయ దేశాల మధ్య డ్రోన్ల దాడికి అదే ప్రారంభం అని అన్నారు. పాక్ డ్రోన్ల దాడికి భారత్ దీటుగా జవాబు చెప్పిందని అన్నారు. పాక్‌కు చెందిన నాలుగు గగనతల రక్షణ స్థావరాలపైకి సాయుధ డ్రోన్లను ప్రయోగించామని చెప్పారు. తాము ప్రయోగించిన డ్రోన్లలో ఒకటి పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను ధ్వంసం చేసిందని తెలిపారు. పాక్ దుస్సాహసం డ్రోన్లకే పరిమితం కాలేదని అన్నారు. నియంత్రణ రేఖ వెంట భారీ ఆయుధాలతో కాల్పులు కొనసాగించిందని చెప్పారు. పాక్ దాడుల్లో మన సైన్యానికి కూడా కొంత నష్టం జరిగిందని, కొందరు గాయపడ్డారని ఈ సందర్భంగా తెలిపారు.

**ప్రార్థనా స్థలాలపై పాక్ దాడి**

ప్రార్థనా స్థలాలపై దాడులు చేస్తున్న పాక్ ఆ నిందను భారత సైన్యంపై వేస్తున్నదని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిశ్రీ చెప్పారు. ఇది ప్రపంచ దేశాలను తప్పుదోవ పట్టించే పాక్ దుష్టయత్నమని పేర్కొన్నారు. అమృత్‌సర్‌లోని ఓ గురుద్వారాపై దాడి జరిపిన పాక్ ఆ నిందను భారత సైన్యంపై వేయడాన్ని ప్రస్తావించారు.

**డ్రోన్ దాడులు మేం చేయలేదు: పాక్**

భారత్‌లోని అనేక ప్రదేశాలపై తాము దాడులు నిర్వహించినట్లు భారతీయ మీడియాలో వచ్చిన వార్తలను పాకిస్థాన్ శుక్రవారం ఖండించింది. ఇవన్నీ నిరాధార వార్తలని, నిర్లక్ష్య ప్రచారంలో భాగమని పాక్ ఆరోపించింది. ఇటువంటి చర్యలు ప్రాంతీయ శాంతిని మరింత దెబ్బతీస్తాయని పాక్ విదేశాంగ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ శుక్రవారం మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉద్దేశపూర్వకంగానే తాము భారతీయ డ్రోన్లను అడ్డుకోలేదని, వాటిని తాము కూల్చివేస్తే భారతీయ దళాలకు పాక్ రక్షణ స్థావరాల ఉనికిని చూపించి నట్లవుతుందని వ్యాఖ్యానించారు. గురువారం పాకిస్థాన్ జరిపిన దాడులకు భారత్ దీటుగా సమాధానం ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**పాక్ డ్రోన్ల దాడిని తిప్పికొట్టాం.. కూల్చివేశాం: భారత సైన్యం**



పశ్చిమ సరిహద్దుల వెంబడి గురువారం రాత్రి పాకిస్థానీ సాయుధ దళాలు డ్రోన్లు, ఇతర ఆయుధాలతో వరుస దాడులు జరిపిందని, వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టామని భారత సైన్యం శుక్రవారం ప్రకటించింది. జమ్ము కశ్మీరులోని నియంత్రరేఖ వెంబడి పాకిస్థానీ రేంజర్లు అనేక చోట్ల కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఎక్స్ వేదికగా భారతీయ సైన్యం వెల్లడించింది. దీంతోపాటు ఓ చిన్న వీడియో క్లిప్‌ను జతచేసిన సైన్యం అన్ని నీచ కుట్రలను దీటుగా తిప్పికొడతామని హెచ్చరించింది. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి జమ్ము కశ్మీరులోని జమ్ము, పఠాన్‌కోట్, ఉధంపూర్‌లోని సైనిక కేంద్రాలపై డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థానీ సేనలు దాడులకు ప్రయత్నించాయని, వాటిని కైనెటిక్, నాన్ కైనెటిక్ సామర్థ్యాలతో నిర్వీర్యం చేశామని గురువారం అర్ధరాత్రి ఒక ప్రకటనలో రక్షణ శాఖ తెలిపింది.

# పాకిస్థాన్ ముష్కరుల కాల్పుల్లో అసువులు బాసిన తెలుగు జవాన్







హైదరాబాద్, మే 9: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండకు చెందిన శ్రీరామ్‌నాయక్, జ్యోతిబాయి దంపతుల ఏకైక సంతానమే మురళీనాయక్ (23). మురళీనాయక్ చిన్నతనంలోనే ఈ కుటుంబం బతుకుదెరువు కోసం ముంబై వెళ్లింది. అక్కడి ఘట్‌కోపర్ ప్రాంతంలో శ్రీరామ్‌నాయక్ కూలిపనులు చేస్తూ మురళిని చదివించాడు. మురళి 4వ తరగతి వరకు ముంబైలోనే చదువుకున్నాడు. ఆ తర్వాత ఉన్నత చదువులన్నీ ఏపీలో పూర్తిచేశాడు. భారత సైన్యంలోకి వెళ్లాలని మురళికి చిన్ననాటి నుంచి కోరిక ఉండేది. తన కోరికను నెరవేర్చుకునేందుకు తల్లిదండ్రులను ఒప్పించి మళ్లీ ముంబై వెళ్లి నాసిక్‌లోని డియోలాలిలో ఆర్మీ శిక్షణ తీసుకున్నాడు. 2022లో అగ్నివీర్‌గా ఇండియన్ ఆర్మీలో చేరాడు. మురళికి మొదట అసోంలో పోస్టింగ్ రాగా, తర్వాత పంజాబ్‌లో విధులు నిర్వర్తించాడు. యుద్ధ సమయంలో అతనికి యూరీలో విధులు కేటాయించారు. పాకిస్థాన్ ఉగ్రవాదుల చొరబాటు దుశ్చర్యను అడ్డుకునే క్రమంలో మురళి అసువులుబాసాడు.

భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతల మధ్య మురళీనాయక్ శుక్రవారం తెల్లవారుజామున మూడున్నర గంటలకు యురిలో జరిగిన ఎదురుకాల్పుల్లో వీరమరణం పొందాడు. ఇంతటి దేశభక్తి కలిగిన యువ సైనికుడు మురళీనాయక్ ముష్కరులను ఎదుర్కొంటూ అతి చిన్న వయసులోనే దేశంకోసం ప్రాణాలు అర్పించాడు. 'ఒక్కరోజైనా సైనికుడిగా బతకాలి' అనే అతని దేశభక్తి.. యావత్తు దేశప్రజల్లో స్ఫూర్తిని నింపింది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత.. పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో చొరబాటుదారులతో పోరాడుతూ అసువులు బాసాడు.

అమ్మవారి జాతర కోసం సొంతూరికి..

తమ స్వస్థలమైన కల్లితండాలో అమ్మవారి జాతర కోసం ఈ నెల 2న మురళీనాయక్ తల్లిదండ్రులు వచ్చారు. అక్కడ వారు జాతర పనుల్లో ఉండగానే కొడుకు అసువులు బాసాడనే దుర్వార్త తెలిసి, దుఃఖసాగరంలో మునిగిపోయారు. తల్లి జ్యోతిబాయి కొడుకును తల్చుకుంటూ విలపించిన తీరు.. చూసేవారి గుండెలను తడిమింది. కొడుకు జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కండ్లలోంచి వస్తున్న కన్నీటిని అదిమిపడుతున్న ఆ తండ్రిని చూసి, ఊరంతా బోరున విలపించింది. ఎప్పుడూ దేశం, ఆర్మీ, యుద్ధం గురించి కబుర్లు చెప్పే స్నేహితుడు వీరమరణం పొందాడని తెలుసుకున్న అతని మిత్రుల కన్నీటిని ఆపడం ఎవరితరమూ కాలేదు. కల్లితండా సమీప గ్రామాలు, తండాలవాసులు వచ్చి మురళీనాయక్‌కు కన్నీటి నివాళులు అర్పించారు. ముంబై ఘాట్‌కోపర్ వార్డు నంబర్ 133లో మురళీనాయిక్‌కు సంతాపం తెలుపుతూ బ్యానర్లు ఏర్పాటు చేసి, స్థానికులు శ్రద్ధాంజలి అర్పించారు.

**వీరజవాన్‌కు ప్రముఖుల నివాళి**

యూరి ఉగ్రదాడిలో వీరమరణం పొందినది తెలుగు జవాన్ అని తెలుసుకున్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు బాధిత కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. మురళీనాయక్ వీరమరణంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గ్రాఘంతిని వ్యక్తంచేశారు. మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రతిపక్ష నేత జగన్ ఎక్స్ వేదికగా నివాళులు అర్పించారు. దేశరక్షణ కోసం పాకిస్థాన్ ఉగ్రవాదులతో పోరాడి అసువులు బాసిన బంజారా ముద్దుబిడ్డ మురళీనాయక్ ప్రాణ త్యాగం అజరామరమని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కొనియాడారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మురళీనాయక్‌కు ఎక్స్ వేదికగా సంతాపం ప్రకటించారు.

**మురళీనాయక్‌కు అశ్రు నివాళి: కేటీఆర్**

ఉగ్రవాదులతో పోరాడి అసువులు బాసిన వీరజవాన్ మురళీనాయక్ మృతికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. భారతీయుల రక్షణ కోసం అమరుడైన మురళీనాయక్‌కు జోహార్ అని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని కోరుకున్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు.

# ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

హైదరాబాద్, మే 9: శంషాబాద్ విమానాశ్రయానికి గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బాంబు బెదిరింపులు వచ్చాయి.

శుక్రవారం ఉదయం 9:56 గంటలకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఎయిర్‌పోర్ట్ అధికారులకు ఈ బెదిరింపు మెయిల్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులు, ఎయిర్‌పోర్ట్ అధికారులు.. తనిఖీలు చేపట్టి ఎలాంటి బాంబు లేదని తేల్చారు

# ఎమ్మార్వోగా డిప్యూటీ కలెక్టర్

### డిమోట్ చేసిన సుప్రీంకోర్టు

### హైకోర్టు ఆదేశాల ధిక్కరణపై సీరియస్ యాక్షన్

హైదరాబాద్, మే 9 ఏపీలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న తాతా మోహనరావును ఎమ్మార్వోగా డిమోట్ చేస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. హైకోర్టు ఆదేశాలను పాటించనందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే.. గతంలో మోహనరావు గుంటూరులో తహసీల్దారుగా ఉన్నప్పుడు ఇండ్ల కూల్చివేతను ఆపాలని ఓ కేసులో ఏపీ హైకోర్టు ఆదేశించింది. ఆ తర్వాత ఆయన ఆ ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా పాటించకపోవడంతో 2 నెలల జైలుశిక్ష విధించింది. ఆ తీర్పును సవాలు చేస్తూ మోహనరావు దాఖలు చేసుకున్న పిటిషన్‌పై ఇటీవల సుప్రీంకోర్టు విచారణ జరిపింది.

ఆ సందర్భంగా జస్టిస్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'మీరేమైనా హైకోర్టు కంటే పెద్దవాడినని, చట్టానికి అతీతుడినని అనుకుంటున్నారా? హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన మిమ్మల్ని ఎలా క్షమించాలి?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ అధికారి అయినా కోర్టు ఆదేశాలను పాటించాల్సిందేనని తేల్చిచెప్పారు. అమరావతి, విజయవాడ, తీహార్‌లలో ఏ జైలుకు వెళ్లాలో నిర్ణయించుకోవాలని మోహనరావుకు స్పష్టం చేశారు. మోహనరావుకు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారని ఆయన తరఫు న్యాయవాది చెప్పడంతో.. 'పిటిషనర్ ఎన్నో కుటుంబాలను ఖాళీ చేయించాడు. వారి పిల్లలు ఏమవుతారు?' అని న్యాయమూర్తి ప్రశ్నించారు. డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న మోహనరావును డిమోట్ చేసి తహసీల్దార్‌గా నియమించాలని తీర్పు ఇచ్చారు.

# ఎన్డీఎఫ్‌కు విరాళంగా నెల వేతనం ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





హైదరాబాద్, మే 9:నేషనల్ డిఫెన్స్ ఫండ్(ఎన్డీఎఫ్)కు ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఉగ్రవాదాన్ని తుడిచి పెట్టేందుకు, దేశ ప్రజల్ని కాపాడేందుకు భారత జవాన్లు చేస్తున్న పోరాటానికి చేయూతగా తన వంతు విరాళం అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తన సహచరులు, కాంగ్రెస్ నాయకులు, పౌరులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునకు పార్టీ నేతలు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తన నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు నెల వేతనాన్ని విరాళంగా సమర్పిస్తున్నట్లు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు ఈ అంశంపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతున్నారు. ఈ అంశంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ కూడా వారి ఒకరోజు వేతనాన్ని నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళంగా ప్రకటించింది.

# ఖైదీల సంక్షేమానికి జైళ్ల శాఖ కృషి హర్షణీయం

### -రాష్ట్ర హోం ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా

### -చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఖైదీల వార్షిక క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం





హైదరాబాద్, మే 9:ఖైదీల్లో శారీరక సామర్థ్యంతో పాటు మానసికోల్లాసాన్ని నింపేందుకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలంగాణ రాష్ట్ర హోం ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, ఐపీఎస్ రవిగుప్తా పేర్కొన్నారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఖైదీల వార్షిక క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు -2025ను ఆయన జైళ్ల శాఖ డీజీ, ఐపీఎస్ డాక్టర్ సౌమ్యమిశ్రా, జైలు ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైదీల సంక్షేమానికి జైళ్ల శాఖ కృషి హర్షణీయమని, ముఖ్యంగా నాలుగు ప్లాట్‌ఫాంలుగా విభజించి ఒక్కొక్క బ్యాచ్‌లో 55మందిని కేటాయించి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. జైళ్ల శాఖ డీజీ, ఐపీఎస్ సౌమ్యమిశ్రా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జైలులో ఖైదీలకు సౌకర్యాలు కల్పించడంతోపాటు వారి సంక్షేమానికి జైళ్ల శాఖ కృషి చేస్తుందన్నారు.

ఈ సందర్భంగా క్రీడాజ్యోతిని వారు ఖైదీలకు అందజేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేంద్ర కారాగారంలోని వివిధ పరిశ్రమల్లో ఖైదీలు తయారు చేస్తున్న వస్తువులు, పండిస్తున్న పంటలు, భోజనశాల, వైద్యశాలతో పాటు వివిధ బ్యారక్‌లను సందర్శించి.. జైలు అధికారులు, సిబ్బంది పనితీరును వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీలు రాజేశ్, మురళీబాబు, హైదరాబాద్ రేంజ్ డీఐజీ డాక్టర్ శ్రీనివాస్, వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్, చర్లపల్లి కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్, వ్యవసాయక్షేత్రం సూపరింటెండెంట్ కళాసాగర్‌లతో పాటు డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, వార్డెన్లు, ఖైదీలు, వివిధ విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు - మంత్రి పొంగులేటి



హైదరాబాద్, మే 9: ప్రెస్ అకాడమీ భవనాన్ని ఈ నెలాఖరులోగా ప్రారంభిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలవారీగా పెన్షన్, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాంపల్లి ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనానికి మరమ్మతులు పూర్తి చేయించి ఈ నెలాఖరులో ప్రారంభిస్తామని తెలిపారు. మండల, నియోజకవర్గ స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

**అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు**

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలైన జర్నలిస్టులకు, అలాగే వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 42.00 కోట్లను ఫిక్స్?డ్? డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమీ ఖర్చు పెడుతుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్ డ్ డిపాజిట్ పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ. 22 కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని విజ్ఞప్తి చేశారు.

**597 మందికి ఆర్థిక సాయం**

మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ. 1,00,000/-తో పాటు అయిదు సంవత్సరాల వరకు, నెలకు రూ. 3000/- ల చొప్పున పెన్షన్, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల కింద 1 నుంచి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు నెలకు వెయ్యి చొప్పున గరిష్ఠంగా ఇద్దరికీ అందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు ఈ ఖాతాలో మొత్తం రూ. 8,98,39,000లు ఆర్థిక సహాయం అందించామన్నారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదని, తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

# పవన్ శక్తి పర్యావరణ హితం !

## (10 మే "జాతీయ విండ్ మిల్ (గాలిమరల) దినం" సందర్భంగా)

గాల్లో మండి శక్తిని ఇవ్వగల పదార్థాన్ని ఇంధనంగా నిర్వచిస్తాం. ఆది మానవుడి నుంచి నేటి వరకు బొగ్గు, వంట చెరుకు, పెట్రోల్, డిసిల్, కిరోసిన్. వంట గ్యాసు లాంటి ఘన/ద్రవ/వాయు పదార్థాలను ఇంధనాలుగా మాడుతూ వస్తున్నాం. భూమి పొరల్లోంచి తవ్వి తీసిన బొగ్గు, పెట్రోలియం లాంటి ఉత్పత్తులను శిలాజ ఇంధనాలుగా పిలుస్తున్నాం. నేడు విద్యుత్ వినియోగమే ప్రజల జీవనాధారంగా మారిన వేళ శిలాజ ఇంధనాల కొరతతో పాటు వాటి వాడకం వల్ల జరుగుతున్న పర్యావరణ విధ్వంసం వల్ల తరిగే సాంప్రదాయ పునరుత్పాదకత సాధించలేని శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గిస్తూనే తరగని, సాంప్రదాయేతర, పునరుత్పాదక శక్తి వనరుల పట్ల మానవ ఆలోచనలు వెళ్లవలసిన అగత్యం ఏర్పడింది.

జాతీయ విండ్ మిల్ (గాలి మరల) దినం:

నేడు పునరుత్పాదక శక్తి వనరులుగా సౌర, పవన, అలల, జియోథర్మల్, హైడ్రో, బయోమాస్ లాంటివి నిలుస్తున్నాయి. గాలులు వీచినపుడు వచ్చే పవనాలతో గాలి మరలను లేదా విండ్ మిల్స్‌ను అమర్చి విద్యుత్తు శక్తిగా మార్చడం అనాదిగా జరుగుతూ వస్తున్నది. నెథర్‌లాండ్స్‌లో ప్రారంభంపైన విండ్ మిల్స్ విప్లవం నేడు ప్రపంచ దేశాలన్నింటిలో ప్రవేశిస్తున్నది. పవన శక్తిని ఒడిసి పట్టే సునాయాస విండ్ మిల్స్ లేదా గాలి మరలకు విస్తృత ప్రచారం కలిపించడానికి ప్రతి ఏట 10 మే రోజున "జాతీయ విండ్ మిల్ లేదా గాలి మరల దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. పర్యావరణ హిత, గ్రీన్, క్లీన్ ఎనర్జీగా లభిస్తున్న పవన శక్తిని విండ్ మిల్స్ ద్వారా గ్రామీణ, మునిసిపల్, ఇతర విభాగాల్లో విద్యుత్ లేదా ఇతర రూపాల్లో వాడడం కొనసాగుతున్నది. నాటి విండ్ మిల్స్‌కు సాంకేతిక సొబగులు అద్ది అత్యాధునిక విండ్ టర్బైన్స్‌ను కూడా రూపొందించి ముందుకు సాగడం జరుగుతోంది.

### పవనశక్తి ప్రయోజనాలు, సవాళ్ళు:

సహజ పవన గమనాలకు అనుగుణంగా గతిశక్తిని గాలి మరలను అమర్చి పర్యావరణహిత, హరిత, శుద్ధ విద్యుత్తు శక్తిని ఉత్పత్తి చేయడం నేడు సర్వత్రా కనిపిస్తున్న దృశ్యాలు. భూతాపానికి గ్రీన్ హౌజ్ వాయువుల ఉద్గారకాలను తగ్గించడం, కార్బన్ ఎమిషన్స్‌ను కట్టడి చేయడం, ఖర్చు తక్కువ కావడం, మేయింటెనెన్స్ సులభం కావడం, శక్తి అవసరాలను తీర్చడం, భూభాగానికి సహకరించడం, విండ్ మిల్స్ స్థాపన సులభం కావడం, ఉద్యోగాల కల్పన జరగడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన పునరుత్పాదక పవన శక్తి ఉత్పత్తితో పాటు వాడకాన్ని కూడా ప్రోత్సహించడం నేటి అవసరంగా మారింది. గాలి మరల వాడకంతో వన్యప్రాణుల సహజత్వానికి విఘాతం కలగడం, శబ్ద కాలుష్యానికి కారణం కావడం, ఎత్తైన ప్రదేశాల్లో భూమి అనుకూలంగా ఉండడం లాంటి ప్రతికూలాలు ఉన్నప్పటికీ పనవ శక్తిని విద్యుత్ రూపంలోకి మార్చడం విధిగా జరగాలి.

### భారత్‌లో పవన శక్తి:

ప్రపంచవ్యాప్తంగా 80 శాతం అత్యధిక పవనశక్తిని ఉత్పత్తి చేస్తున్న ఐదు దేశాల్లో జర్మనీ, అమెరికా, డెన్మార్క్, స్పెయిన్, భారత్ ఉన్నాయి. భారత్‌లో పవనశక్తిని అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రాల జాబితాలో ఏపి, గుజరాత్, కర్నాటక, ఎంపీ, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళ నాడులు ముందున్నాయి. భారత పునరుత్పాదక శక్తి వనరుల మంత్రిత్వశాఖ లక్ష్యాల ప్రకారం 2030 నాటికి 30 జిడబ్ల్యూ పవన శక్తిని ఒడిసి పట్టడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. విండ్ టర్బైన్స్ ద్వారా పవనంలో దాగిన గతి శక్తిని, తొలుత యాంత్రిక శక్తిగా మార్చడం, యాంత్రిక శక్తిని విద్యుత్తు శక్తిగా మార్చడం భారతంలో విస్తృతంగా జరుగుతున్నది.

పర్యావరణ హిత, గ్రీన్, క్లీన్, తరగని, పునరుత్పాదక పవన శక్తిని వీడడం వల్ల ప్రత్యక్షంగా కార్బన్ ఉద్గారాలు తగ్గిపోయి ప్రతికూల వాతావరణ మార్పులు అదుపు చేయబడతాయి. సులభంగా, ఉచితంగా, విరివిగా అందుబాటులో ఉన్న పవన శక్తిని విద్యుత్‌గా మార్చడం వల్ల వ్యక్తిగత శక్తి స్వేచ్ఛ లభిస్తుంది. నేడు సోలార్ పవర్ ప్లాంట్ల వలె విండ్ పవర్‌ను వాడడం కూడా బహుళ ప్రచారంలోకి రావాలి, రేపటి పరిశుద్ధ పర్యావరణానికి పునరుద్ధరణ జరగాలి.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కౌటిల్యుని సిద్ధాంతాన్ని మన ప్రధాని ఆచరణలో చూపించారు: ఉపరాష్ట్రపతి

"కౌటిల్యుని సిద్ధాంతాన్ని మన ప్రధానమంత్రి ఆచరణలో చేసి చూపించారు. పరిపాలనకు సంబంధించిన ప్రతి అంశంలోనూ కౌటిల్యుని ఆలోచనా విధానం ఓ ప్రామాణిక గ్రంథం. రాజనీతి, రక్షణ, రాజు ఇప్పుడు ఎన్నికవుతున్న వారి పాత్ర గురించి వివరించే ఎన్‌సైక్లోపీడియా. పొత్తులు మారుతున్న, భిన్న ధ్రువాలున్న ప్రపంచంలో... ఓ సిద్ధాంతం ఉంది అదే అస్థిరత. పొత్తుల్లోనూ మనం దీన్ని గమనించవచ్చు. ఈ అస్థిరత ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగుతుందని కౌటిల్యుడు ఏనాడో ఊహించారు. ఇక్కడ కౌటిల్యుని సూక్తిని నేను చెప్పదలుచుకున్నాను: 'పొరుగు రాజ్యం మన శత్రువు. ఆ శత్రువుకి శత్రువు మన మిత్రుడు'. ఈ విషయం భారత్ కంటే ఏ దేశానికి బాగా తెలుసు.. మనం ఎల్లప్పుడూ ప్రపంచ శాంతిని, సోదరభావాన్ని, సంక్షేమాన్ని విశ్వసిస్తాం" అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ అన్నారు.

ఇండియా ఫౌండేషన్‌కు చెందిన కౌటిల్య పరిశోధకులతో న్యూఢిల్లీలో ఈ రోజు ఉపరాష్ట్రపతి ముచ్చటించారు. "మన ప్రధానమంత్రి గొప్ప దార్శనికుడు. గొప్ప విశ్వాసం ఉన్న వ్యక్తి. భారీ స్థాయిలో సానుకూల మార్పులు తీసుకురావడంలో ఆయన నమ్మకం కనబరుస్తారు. దశాబ్దం కాలం పాటు సాగించిన పరిపాలనలో ప్రభుత్వ నిర్ణయాలు చెరగని ముద్ర వేశాయి. కొన్ని దశాబ్దాల అనంతరం మరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన వ్యక్తి మనకు ఉన్నారు. అదే ఈ మార్పులన్నింటికీ కారణం"

కౌటిల్యుడు ఒక అంశానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారని ఉపరాష్ట్రపతి తెలిపారు. "ప్రజాస్వామ్యం భాగస్వామ్య విధానంలో ఉండాలి. అభివృద్ధిలోనూ సమాన స్థాయిలో భాగస్వామ్యం ఉండాలి. జాతీయ సంక్షేమంలో పౌరులు పోషించాల్సిన పాత్రకు ఆయన అధిక ప్రాధాన్యమిచ్చారు. ఒక దేశాన్ని మర్యాద, క్రమశిక్షణ కలిగినదిగా నిర్వచిస్తే ? అది ఆ దేశంలోని పౌరుల స్వభావంగా పరిగణించాలి. అదే విధంగా కౌటిల్యుని మరో సూక్తిని ప్రస్తావిస్తున్నాను: 'ఒక చక్రంతో బండి ముందుకు కదలనట్లే'.. ఒంటి చేత్తో పరిపాలనను సాగించలేం" అని ధన్కడ్ పేర్కొన్నారు.

సమకాలీన పాలనా వ్యవహారాల్లో ఈ సూత్రాలు ఎలా ప్రతిబింబిస్తాయో ఉపరాష్ట్రపతి వివరించారు. "ఈ దేశంలో వినూత్నమైన పరిపాలనా విధానం అమలవుతోంది. మన దేశంలో వెనుకబడిన జిల్లాలు కొన్ని ఉండేవి. అక్కడి వెళ్లి విధులు నిర్వర్తించడానికి అధికారులు ముందుకు వచ్చేవారు కాదు. అలాంటి జిల్లాలకు 'ఆకాంక్షాత్మక జిల్లాలు'గా ప్రధానమంత్రి నామకరణం చేశారు. ఇప్పుడు ఆ 'ఆకాంక్షాత్మక జిల్లాలు' అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయి. ప్రజలు మెట్రో నగరాలకు ఎక్కువ వలస వెళుతున్నారని గుర్తించిన ప్రధానమంత్రి, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు ఆర్థిక కార్యకలాపాల కేంద్రాలుగా మార్చాలని భావించారు. స్మార్ట్ నగరాలు అనే భావనకు రూపకల్పన చేశారు. స్మార్ట్‌సిటీలు అంటే మౌలికసదుపాయాల కల్పనకు లేదా సుందరీకరణకు సంబంధించినవి కాదు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చేవి." అని ధన్కడ్ తెలిపారు.

అధికారం, పరిపాలనకు సంబంధించిన ప్రాథమిక సూత్రాల గురించి ఉపరాష్ట్రపతి వివరిస్తూ.. "అధికారానికి పరిమితులుంటాయి. ఆ అధికార పరిమితులను దృష్టిలో ఉంచుకున్నప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. కౌటిల్యుడి తత్వశాస్త్రాన్ని లోతుగా అధ్యయనం చేస్తే ఇవన్నీ ఒకే అంశానికి, పాలనా విధానానికి ప్రజల సంక్షేమానికి దారి చూపిస్తాయి".

కౌటిల్యుడి అర్థశాస్త్రాన్ని ఉటంకిస్తూ "రాజు ఆనందం ప్రజల సంతోషంలోనే ఉందని కౌటిల్యుడు చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని అనుసరిస్తున్న ఏ దేశ రాజ్యాంగంలోనైనా ఇదే సారాంశం ప్రజాస్వామ్య పరిపాలన, ప్రజాస్వామ్య విలువల స్ఫూర్తిగా అంతర్లీనంగా కనిపిస్తుంది" అని శ్రీ ధన్కడ్ అన్నారు.

భారతదేశ నాగరిక విలువల గురించి మాట్లాడుతూ "ఆలోచలను వ్యక్తం చేసే విధానం, సంభాషణ ఒకరినొకకరు మెచ్చుకొనేలా ఉంటే ప్రజాస్వామ్యం విస్తరిస్తుంది. అదే ఇతర పాలనా విధానాల నుంచి ప్రజాస్వామ్యాన్ని వేరు చేస్తుంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత లేదా పరాయి పాలన నుంచి విముక్తి పొందిన తర్వాత భారత్‌లో ప్రజాస్వామ్యం ప్రారంభం కాలేదు. వేల ఏళ్లుగా మన దేశం ప్రజాస్వామ్యాన్ని అనుసరించింది. ఈ వ్యక్తీకరణ, చర్చలను అభివ్యక్తి, వాద్ వివాద్‌గా సంస్కృతంలో వేద సంస్కృతిలో అనంత వాద్‌గా పిలుస్తారు" అంటూ తన ప్రసంగాన్ని ఉపరాష్ట్రపతి ముగించారు.

# రూ. 10 లక్షల గంజాయి పట్టివేత

## –20.6 కేజీల గంజాయి, కారు స్వాధీనం..



సంగారెడ్డి మే 09(నేటి నిజం ప్రతినిది)మహారాష్ట్ర ఔరంగబాద్‌లోని ఒక కంపెనీలో అపరేటర్‌గా పని చేస్తాడు. వస్తున్న జీతం సరిపోవడం లేదని గంజాయి వ్యాపారంలోకి దిగాడు. రెండేళ్లుగా ఉద్యోగం తో పాటు గంజాయి వ్యాపారం చేస్తున్నాడు.

2023లో ఒకమారు గంజాయి రవాణ చేస్తూ అబుల్లాపూరమెట్‌లో ఒకసారి పట్టుబ డ్డాయి.

ఈ కేసులో జైలుకు కూడ వెళ్లి వచ్చాడు. ఐనా గంజాయి వ్యాపారం కొనసాగిస్తున్న జలీలోద్దీన్ సిద్ధిఖి అహ్మమద్ హుస్సేన్ మరోమారు గంజాయిని తరలిస్తూ ఎస్ టి ఎఫ్ ఏ టీమ్ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన వెలుగులోకి వచ్చింది.

జలీలోద్దీన్ సిద్దిఖి అహ్మమద్ హుస్సెన్ అనే వ్యక్తి సీలేరు నుంచి గంజాయిని తీసుకొని మహారాష్ట్రలోని పలుప్రాంతాల్లో అమ్మకాలు సాగిస్తూ ఉంటాడు.

లక్ష్మీబాయి అనే మహిళ వద్ద 20.6 కేజీల గంజాయిని తీసుకొని జాతీయ రహదారి 65లో సంగారెడ్డి పోతురెడ్డిపల్లిలోని పల్లవి అపార్ట్‌మెంట్ ప్రాంతంలో కారులో వెళ్తుండగా గంజాయిని ఎస్ టి ఎఫ్ ఏ టీమ్ లీడర్ అంజి రెడ్డి టీమ్ సిబ్బంది పట్టుకున్నారు.

ఈ కేసుల్లో గంజాయిని కొనుగోలు చేసి అమ్మకాల కోసం తీసుక వెలుతున్న జలీలోద్దీన్ సిద్దిఖి అహ్మమద్ హుస్సెన్, గంజాయి అమ్మకాలు జరిపిన లక్ష్మీబాయి, కృష్ణ కొన అనేవ్యక్తులపై కేసు నమోదు చేశారు.

కారు, గంజాయి, నిందితుడు జలీలోద్దీన్ సిద్దిఖి అహ్మమద్ హుస్సెన్ అరెస్టు చేసి సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్ టి ఎఫ్ ఏ టీమ్ లీడర్ అంజి రెడ్డితెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 10 లక్షలు ఉందని తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో ప్రధాని మోదీ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం

న్యూఢిల్లీ, మే 9:జాతిభద్రత విషయమై ఇటీవలి పరిణామాల నేపథ్యంలో దేశం మొత్తంలో అప్రమత్తత, అంతర మంత్రిత్వశాఖల మధ్య సమన్వయం వంటి ముఖ్యమైన అంశాలను సమీక్షిస్తూ... వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల కార్యదర్శులతో ఈరోజు జరిగిన ఉన్నత స్థాయి సమావేశానికి ప్రధానమంత్రి అధ్యక్షత వహించారు. మంత్రిత్వశాఖలూ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య సందిగ్ధానికి తావులేకుండా చక్కటి సమన్వయం ఉండాలనీ, వ్యవస్థ మొత్తం అత్యంత పటిష్టంగా ఉండాలనీ ఆయన గట్టిగా సూచించారు.

ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కోవడంలో మంత్రిత్వ శాఖల ప్రణాళికలను, సన్నద్ధతను ప్రధాని సమీక్షించారు.

తమకు సంబంధించిన మంత్రిత్వ శాఖల కార్యకలాపాలపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని ఆయన కార్యదర్శులను ఆదేశించారు. అలాగే అవసరమైన వ్యవస్థల పనితీరులో ఎలాంటి లోపాలు లేకుండా చూడటంతో పాటు సన్నద్ధత, అత్యవసర సమయాల్లో స్పందన, అంతర్గత సమాచార వ్యవస్థల ప్రొటోకాల్‌పై దృష్టి సారించాలని ఆదేశించారు.

ప్రస్తుత వాతావరణానికి అనుగుణంగా– మంత్రిత్వశాఖల ప్రణాళికలూ– సన్నద్ధత అంశాలను ఆయన సమీక్షించారు.

మంత్రిత్వశాఖల సన్నాహాలు, సంబంధిత అత్యవసర వ్యవస్థలు సరిగ్గా పనిచేస్తున్నదీ లేనిదీ కూడా శాఖల వారీగా ఆయా శాఖలకు చెందిన కార్యదర్శులు పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. అత్యవసర వ్యవస్థల సన్నద్ధత, సత్వర స్పందన, ప్రోటోకాల్ కు అనుగుణంగా సమాచార వినిమయం– అన్న అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ప్రధాని సూచించారు.

ప్రస్తుత సమయంలో– ప్రభుత్వం–ఏకోన్ముఖంగా అన్నట్లు ఏ రకంగా ప్రణాళికలను సిద్ధం చేసుకున్నదీ కార్యదర్శులు వివరంగా ప్రధానమంత్రి ముందు ఉంచారు.

ఘర్షణకు సంబంధించి– వెంటనే కార్యచరణకు దిగాల్సిన అంశాలను అన్ని మంత్రిత్వశాఖలూ ఇప్పటికే గుర్తించాయి. కార్యాచరణకు వీలుగా వాటిని మరింత బలోపేతం కూడా చేశారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వాటిని ఎదుర్కొనేందుకు మంత్రిత్వశాఖలన్నీ సర్వసన్నద్ధంగా ఉన్నాయి.

సమావేశంలో అనేక అంశాలు చర్చకు వచ్చాయి. సివిల్– డిఫెన్స్ వ్యవస్థలూ, అబద్ధపు వార్తల ప్రచారాన్ని నిరోధించడం, కీలక వ్యవస్థల భద్రత వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు, క్షేత్రస్థాయి వ్యవస్థలతోనూ సమన్వయం చేసుకోవాలని కూడా మంత్రిత్వశాఖలకు సూచించారు.

ఈ సమావేశంలో క్యాబినెట్ కార్యదర్శి, ప్రధానమంత్రి కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారులు, రక్షణ, హోం వ్యవహారాలు, విదేశీ వ్యవహారాలు, సమాచార–ప్రసార శాఖ, విద్యుత్, ఆరోగ్యం, టెలికమ్యూనికేషన్లతో పాటు ఇతర కీలక మంత్రిత్వ శాఖల కార్యదర్శులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న సున్నిత వాతావరణంలో– నిరంతర అప్రమత్తత, సంస్థాగత సమన్వయం, స్పష్టమైన సమాచార వినిమయం ఉండాలని ప్రధానమంత్రి తెలిపారు. దేశభద్రత, కార్యసన్నద్ధత, పౌర రక్షణ అంశాల్లో ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

# చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో 11మందికి జీవిత ఖైదు

కర్నూల్ అమరావతి, మే 9:కర్నూలు జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2017 మే 21న కృష్ణగిరి మండలంలో వైఎస్సార్సీపీ నేత చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో 11మందికి జీవిత ఖైదుతో పాటు వెయ్యి చొప్పున జరిమానా విధించిం ది. ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో 29 మంది సాక్షులను కోర్టు విచారించింది.

2017 మే 21న కృష్ణగిరి మండలంలో నారాయణ రెడ్డి హత్య జరిగింది. ఈ కేసులో 29 మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. వాస్తవంగా ఈకేసులో మొత్తం 19మంది నిందితులు కాగా. ఇందులో ఐదు మందిపై నేరం రుజువు కాలేదు.

ఇక కేసులో నిందితులుగా పేర్కొన్న, ప్రస్తుత పత్తికొండ ఎమ్మెల్యే కేఈ. శ్యాంబాబు, దేవనకొండకు చెందిన కప్పట్రాళ్ల బుజ్జమ్మ పేర్లను గతంలోనే.. న్యాయస్థానం ఆదేశాల మేరకు తొలగించగా, ఇక ఈ కేసులో నాలుగో నిందితుడిగా ఉన్న వ్యక్తి.. ఇటీవలనే అనారోగ్యంతో మరణించారు.

మొత్తంగా చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో 11మందికి జీవిత ఖైదు పడడం జిల్లాలో సంచలనంగా మారింది. ఫ్యాక్షన్ కిల్లాగా పేరొందిన కర్నూలు జిల్లాలో ఇలాంటి తీర్పులు.. ముద్దాయిలకు ముచ్చెమటలు పట్టించనున్నాయి. తీర్పు నేపథ్యంలో కర్నూలు జిల్లా కోర్టు వద్ద విషాదం అలుముకుంది. శిక్ష పడిన వ్యక్తులను తక్షణమే పోలీసులు సబ్ జైలుకు తరలించే ప్రయత్నంలో ఉండడంతో.. శిక్ష పడిన ఖైదీల బంధువుల రోదనలు మిన్నంటాయి.

# భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలి

## – జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి మే 09(నేటి నిజం ప్రతినిది) జిల్లా భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులలో భాగంగా శుక్రవారం జిల్లా కొండాపూర్ మండలం, గొల్లపల్లి, గ్రామం లో నిర్వహించిన సదస్సులో కలెక్టర్ క్రాంతి వల్లూరుపాల్గొన్నారు.

సదస్సుకు హాజరైన రైతులతో భేటీ అయ్యి, వారు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, అధికారులకు సూచనలు చేశారు.

రైతులు సమర్పించిన దరఖాస్తులో భూ సమస్యలను పేర్కొనే సమయంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఆన్లైన్ లో జాగ్రత్తగా ఎంట్రీ చేయాలని అన్నారు.

వివరాల నమోదులో తప్పిదాలకు ఆస్కారం కల్పించకూడదని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు హితవు పలికారు.

దరఖాస్తుల పరిశీలన ఆన్లైన్ నమోదు ప్రక్రియలపై పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు.

భూ రికార్డులలోని వివరాలను పక్కాగా సేకరిస్తూ, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం 18 రాష్ట్రాలలో సమగ్ర అధ్యయనం జరిపి, నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం అమలులోకి తెచ్చిందని అన్నారు.

ప్రస్తుతం పైలెట్ ప్రాతిపదికన కొండాపూర్ మండలంలోని ఆయా గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చిన ప్రతి



దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్ణీత గడువు లోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వివిధ కారణాల వల్ల రెవెన్యూ సదస్సులో అర్జీలు సమర్పించే అవకాశం లభించని వారు తరువాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

భూ రికార్డులలో పేరు తప్పుగా ఉండడం, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావంలో మార్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్–బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర వాటికి సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి భూభారతి చట్టంలో పొందుపర్చిన మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేలా రెవెన్యూ బృందాలకు మార్గనిర్దేశం చేశామని కలెక్టర్ తెలిపారు.

పైలట్ ప్రాజెక్టు కింద కొండాపూర్ మండలంలో రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించిన మీదట, జిల్లాలోని మిగితా మండలాల్లో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

అంతకుముందు కొండాపూర్ మండలం తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులఆన్లైన్ నమోదు ప్రక్రియ ను పరిశీలించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు.

ఈ సదస్సులలో ఆర్డిఓ రవీందర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# రైలు కిందపడి యువకుడు మృతి..

అమరావతిమే 9:నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లె రైల్వే స్టేషన్ వద్ద గురువారం గుర్తు తెలియని యువకుడు గూడ్స్ రైలు కింద పడి మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. రైల్వే స్టేషన్ సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గాజులపల్లి స్టేషన్ సమీపంలో వచ్చే గూడ్స్ కింద పడి యువకుడు మృతి చెందాడు. తల, మొండెం, శరీరం వేరువేరుగా పడిపోయాయి.గాజులపల్లె రైల్వే స్టేషన్ సిబ్బంది నంద్యాల రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. నంద్యాల రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. మృతిచెందిన యువకుడి వివరాలను కనుగొనేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు.

# పాకిస్థాన్ కవ్వింపు చర్యలు విఫలం: సముచిత రీతిలో తిప్పికొట్టిన భారత్

న్యూఢిల్లీ, మే 9:ఆపరేషన్ సిందూర్ గురించి వివరించేందుకు 2025 మే 7న భారత్ విలేకరుల సమావేశం నిర్వహించింది. ఉగ్రవాద దుశ్చర్యలపై నిర్దిష్ట లక్ష్యంతో, సమతూకంతో, ఉద్రిక్తతలకు తావివ్వని రీతిలో ప్రతిస్పందించినట్లు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పాకిస్థాన్ సైనిక స్థావరాలను తాము లక్ష్యం చేసుకోలేదని నిర్దిష్టంగా వివరించింది. అయితే, భారత్‌లోని సైనిక స్థావరాలపై దాడికి పాల్పడితే దీటైన రీతిలో తిప్పికొట్టడం తథ్యమని పునరుద్ఘాటించింది. ఉత్తర, పశ్చిమ భారత ప్రాంతాల్లోని అనేక సైనిక స్థావరాలు లక్ష్యంగా ఈ నెల 7వ తేదీ రాత్రి పాకిస్థాన్ దాడికి యత్నించిందని పేర్కొంది. ఈ మేరకు అవంతిపుర, శ్రీనగర్, జమ్ము, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తల, జలంధర్, లూథియానా, ఆదంపూర్, భటిండా, చండీగఢ్, నాల్, ఫలోడి, ఉత్తర్‌లాయ్, భుజ్ సహా అనేక సైనిక లక్ష్యాలపై డ్రోన్‌లు, క్షిపణులుప్రయోగించిందని తెలిపింది. అయితే, సమీకృత కౌంటర్ 'యుఎఎస్' గ్రిడ్, గగనతల రక్షణ వ్యవస్థల సాయంతో వాటిని మార్గమధ్యంలోనే నేలకూల్చినట్లు వివరించింది.

పాకిస్థాన్ సదరు దాడులకు పాల్పడిందని నిరూపించే ఆధారాల కోసం అది ప్రయోగించిన ఆయుధ శకలాలను పలు ప్రదేశాల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపింది.

ఈ నేపథ్యంలో నేటి ఉదయం భారత సాయుధ దళాలు పాకిస్థాన్‌లోని అనేక ప్రదేశాల్లో వైమానిక రక్షణ రాడార్లు, వ్యవస్థలు లక్ష్యంగా దాడి చేశాయి. ఆ మేరకు పాక్ కవ్వింపులకు సముచిత రీతిలో భారత్ దీటుగా ప్రతిస్పందించింది. తదనుగుణంగా లాహోర్‌లోని వైమానిక రక్షణ వ్యవస్థను ధ్వంసం చేశామని నిర్ధారించింది. జమ్ము కాశ్మీర్‌లోని కుప్వారా, బారాముల్లా, ఉరీ, పూంచ్, మెంధార్, రాజౌరి సెక్టార్ల పరిధిలోని ప్రాంతాల్లో ఎలాంటి కవ్వింపు చర్యలు లేకపోయినా పాక్ సైనికులు మాత్రం నియంత్రణ రేఖ వెంబడి మోర్టార్లు, భారీ ఆయుధ సామగ్రితో కాల్పులు ముమ్మరం చేశారు. ఈ దుశ్చర్య ఫలితంగా ముగ్గురు మహిళలు, ఐదుగురు బాలలు సహా 16 మంది అమాయక పౌరులు మరణించారని తెలిపింది. పర్యవసానంగా పాకిస్థాన్‌ను నిలువరించేందుకు తాము కూడా దీటుగా స్పందించక తప్పలేదని భారత్ స్పష్టం చేసింది.




# జిల్లాలో పోలీసుల స్పెషల్ డ్రైవ్



కర్నూలు, మే 9: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ఆదేశాలతో కర్నూలు జిల్లా ఇంచార్జ్ ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పర్యవేక్షణలో కర్నూలు జిల్లా వ్యాప్తంగా గత రాత్రి 9 గంటల ఇవాళ నుండి 11 గంటల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.జిల్లాలోని కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్లలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, లాడ్జీలు, బస్టాండ్ లు, రైల్వేస్టేషన్ లు, బార్డర్ చెక్ పోస్టులు అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. లాడ్జీలకు అనుమానాస్పద వ్యక్తులు కానీ, కొత్తగా ఎవరైనా వ్యక్తులు తారసపడితే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని లాడ్జి నిర్వాహకులకు పోలీసు అధికారులు తెలియజేశారు.

# మద్యం స్కాంపై సీబీఐ విచారణ జరగాల్సిందే : ఎంపీ కేశినేని



అమరావతి, మే 9:నాసిరకం మందు పంపిణీ చేసి, వేలకోట్ల రూపాయలు కుంభకోణం జరిగిన మద్యం స్కాంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ డిమాండ్ చేశారు. లిక్కర్ స్కాం లో రూ.3600 కోట్లు కొల్లగొట్టింది వైయస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని, పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలంటూ ఆయన గురువారం సీబీఐ చీఫ్ కు లేఖ రాశారు. మద్యం స్కాం నుండి దృష్టి మరల్చడం కోసమే జగన్ పాలేరుగా ఉన్న కేశినేని నాని బురదజల్లే రాజకీయాలకు తెరలేపినట్లు చెప్పారు. తాను అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ నికార్సైన కార్యకర్తనేనన్నారు.

విజయవాడలోని గురునానక్ కాలనీలో ఉన్న ఎన్టీఆర్ భవన్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డితో తనకు పరిచయం ఉన్న మాట వాస్తవమేనని, తనకు ఉన్న ఆస్తికి అతను పోరుగునే ఉండడంతో స్థలాన్ని కలని డెవలప్మెంట్ చేయడం కోసం కంపెనీని ప్రారంభించినట్లు తెలిపారు. జగన్ తో ఉన్న సాహిత్యం, అతనితో ఉన్న ఆర్థిక వ్యాపార లావాదేవీలు, పద్ధతులు నచ్చక తాను స్వచ్ఛందంగా తప్పుకున్నానని డెవలప్మెంట్ తో సహా ఆరు నెలల పాటు అన్ని ఖర్చులు తానే పెట్టుకున్నట్లు చెప్పారు.

ఏపీ లిక్కర్ స్కాం కు సంబంధించి లావాదేవీలన్నీ జగన్మోహన్ రెడ్డి నాలుగు కార్యాలయాల్లో జరిగాయని, సూత్రధారి తాడేపల్లి ప్యాలెస్ లోనున్న వ్యక్తేనన్నారు. ఆ ప్యాలస్ లోకి రాజ్ కసిరెడ్డితో సహా నలుగురికే ప్రవేశముంటుందన్న ఆయన ఈమధ్య హైదరాబాదులో ఈ లిక్కర్ వ్యవహారం దృష్టి మరల్చడానికే ఐదుగురు సమావేశమయ్యారని ధనుంజయ రెడ్డి కృష్ణమోహన్ రెడ్డి గోవిందప్పతో సహా విజయవాడ పాలేరు నాని కూడా అందులో ఉన్నారన్న అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. లిక్కర్ స్కామ్ తో పాటు, తనపై వచ్చిన ఆరోపణలకు తాను బహిరంగ చర్చకు సిద్ధమేనని, 24 గంటల్లోగా చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు.

దేశ ప్రతిష్టను పెంచిన ఆపరేషన్ సింధూర

ముష్కరులను తుద ముట్టించేందుకు భారత సైన్యం జరిపిన ఆపరేషన్ సింధూరతో దేశ ప్రతిష్ట మరింత పెరిగిందని విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. పహల్గామ్ బాధితులు కూడా ఈ ఆపరేషన్ స్వాగతిస్తున్నారన్న ఆయన భారత సైన్యానికి ప్రత్యేక అభినంద నలు తెలిపారు. భారత సైన్యం, ప్రధానమంత్రి మోడీ తీసుకునే ఏ చర్యకైనా దేశమంతా వారి వెంటే ఉంటుందని చెప్పారు.

# నా జీతం .. మీ జీవితం కోసం : పవన్ కళ్యాణ్



అమరావతి, మే 9: పిఠాపురం నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మకంతో శాసనసభ్యుడిగా గెలిపించారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధితోపాటు సమస్యలను పరిష్కరించడం నా బాధ్యత' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

పిఠాపురం ప్రజలు ఇచ్చిన అధికారం ద్వారా వచ్చిన జీతాన్ని అక్కడే వినియోగించాలని నిర్ణయించుకున్నాను? అందులో భాగంగా నియోజకవర్గం పరిధిలోని తల్లిదండ్రులు లేని బిడ్డల భవిష్యత్తు కోసం ఆ మొత్తం ఇస్తున్నట్టు తెలిపారు. పదవి ఉన్నంతకాలం వచ్చే జీతం మొత్తాన్ని ఆ బిడ్డల సంక్షేమానికి వినియోగించనున్నట్టు స్పష్టం చేశారు.

శుక్రవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన 42 మంది అనాథ పిల్లలకు ఆయన తన వేతనం నుంచి ఒక్కొక్కరికీ నెలకి రూ. 5 వేల చొప్పున రూ. 2,10,000 ఆర్థిక సాయం అందించారు. జీతంలో మిగిలిన మొత్తాన్ని కూడా వారి బాగోగులు చూసేందుకే ఖర్చు చేయనున్నట్టు ప్రకటించారు. శుక్రవారం అందుబాటులో ఉన్న 32 మందికి స్వయంగా సాయాన్ని అందజేశారు.

మిగిలిన పది మందికీ జిల్లా యంత్రాంగం ద్వారా ఆ మొత్తాన్ని అందిస్తామని తెలిపారు. ప్రతి నెలా ఈ సాయం వారి ఇళ్ల వద్దే అందించేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని శాసన సభ్యుడిగా ఎన్నికైన తర్వాత వేతనం తీసుకోకూడదని నిర్ణయించుకున్నాను. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్న భావనతోనే వేతనం తీసుకున్నాను. వేతనం రూపంలో తీసుకున్న ఆ మొత్తాన్ని నన్ను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గం పరిధిలో కన్నవారు దూరమైన పిల్లల భవిష్యత్తు కోసం, వారి చదువుల ఖర్చు చేయాలనుకున్నాను. ప్రభుత్వం, పదవి ఉన్నంతకాల జీతం మొత్తం అనాథ బిడ్డల సంక్షేమానికి వినియోగిస్తాను" అన్నారు.

## జీవజలం బలం

### సాహిత్య స్మారకోపన్యాస సభ

18.5.2025 ఆదివారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి, కాన్ఫరెన్స్ హాలులో
బలం సాహిత్య స్మారకోపన్యాస సభ జరుగుతుంది

బలం స్త్రీ, ప్రేమలేఖల గ్రంథాలపై
కె. ఎన్. మల్లీశ్వరి, నెల్లుట్ల రామాదేవి ప్రసంగిస్తారు

మామిడి హరికృష్ణ ఆప్తవాక్యం పలుకుతారు

బలం స్త్రీ, ప్రేమలేఖలలోని కొన్ని ముఖ్య భాగాలను -
డా. సలీమా, డా. లక్ష్మి అసిరెడ్డి, డా. దాసోజు పద్మావతి, డా. శ్రీ భాష్యం అనురాధ,
నస్రీన్ ఖాన్ లు వినిపిస్తారు

ఈ సభకు మీరు తప్పక రావాలని మనవి

-- నాళేశ్వరం శంకరం
కన్వీనర్, బలం భావన



# నాణ్యమైన ఆయుధ సంపత్తి, శక్తిమంతమైన, సుశిక్షితులైన భద్రతా సిబ్బంది వల్లే

# ఆపరేషన్ సిందూర్ విజయవంతం: నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్ 2025లో రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, మే 9:"నాణ్యమైన ఆయుధ సంపత్తి, శక్తిమంతమైన, సుశిక్షితులైన భద్రతా సిబ్బంది వల్లనే ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది" అని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్‌లో రక్షణ మంత్రి ప్రసంగించారు. ఏ అమాయక పౌరుడికి హాని చేయకుండా, అతి తక్కువ నష్టంతో త్రివిధ దళాలు ఆపరేషన్ పూర్తి చేశాయని, ఇది ఊహకు అందని విజయమని, దేశానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.

"ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్లో తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశాం. పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులు హతమయ్యారు. ఇది జాతీయ ప్రయోజనాలను పరిరక్షించడంలో 'నాణ్యత' పోషించే కీలకపాత్రను తెలియజేస్తుంది" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

అత్యంత సంయమనం పాటించే బాధ్యతాయుతమైన దేశంగా భారత్ ఎల్లప్పుడూ తన పాత్రను పోషిస్తుందని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. అలాగే చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలనే విధానాన్ని విశ్వసిస్తుందని ఆయన తెలిపారు. ఈ సహనాన్ని ఎవరైనా అలుసుగా తీసుకుంటే వారు 'తీవ్రమైన పర్యవసానాలు' ఎదుర్కోవాల్సి వస్తుందని రక్షణ మంత్రి హెచ్చరించారు. భారత దేశ సార్వభౌమత్వాన్ని రక్షించడంలో ప్రభుత్వానికి ఏ పరిమితి ప్రతిబంధకంగా మారదని హామీ ఇచ్చారు. "భవిష్యత్తులో కూడా ఇలాంటి బాధ్యతాయుతమైన ప్రతిచర్యలు చేపట్టేందుకు మేం సిద్ధంగా ఉన్నాం" అని ఆయన అన్నారు.

సదస్సు ఇతివృత్తమైన 'ఫాస్ట్ ట్రాకింగ్ ఆఫ్ క్వాలిటీ అస్యూరెన్స్ త్రూ ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ అండ్ టెక్నాలజీ ఎనేబుల్డ్ ప్రాసెసెస్" గురించి తన ఆలోచనలను శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా రక్షణ రంగంలో కనిపిస్తున్న మార్పులను పరిగణనలోకి తీసుకుంటే వేగంగా నాణ్యతను అంచనా వేయడం ప్రస్తుతం చాలా అవసరమని పేర్కొన్నారు.

రక్షణ రంగంలో సార్వభౌమత్వం అనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సిద్ధాంతం ఆధారంగా 2014 నుంచి రక్షణ ఉత్పత్తుల తయారీ రంగాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చిందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలియజేశారు. "రక్షణ సార్వభౌమత్వం అంటే ఒక దేశం తన భద్రతా అవసరాలకు సంబంధించి తన సామర్థ్యాన్ని పెంచుకొని స్వయం సమృద్ధి సాధించే వరకు ఆ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని భావించలేం. విదేశాల నుంచి మనం ఆయుధాలు కొనుగోలు చేసుకుంటూ ఉంటే.. మన దేశ భద్రతను వారి దయకు వదిలేస్తున్నట్టే. అందుకే ఈ అంశంపై మా ప్రభుత్వం తీవ్రంగా ఆలోచించి ఈ రంగంలో స్వావలంబన సాధించే దిశగా నిర్ణయాత్మక అడుగు వేసింది. విస్తరిస్తున్న రక్షణ పారిశ్రామిక రంగం దేశాన్ని మునుపెన్నడూ లేని విధంగా శక్తిమంతం చేసింది" అని తెలిపారు.

రక్షణ ఉత్పత్తిలో నాణ్యత, పరిమాణాలకు సమాన ప్రాధాన్యమిస్తూ, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డు (ఓఎఫ్‌బీ) కార్పొరేటీకరణ సహా అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టినట్లు శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. నాణ్యతను ప్రభుత్వ ప్రాధాన్య సంస్కరణల ఎజెండాగా ఆయన అభివర్ణించారు. ఓఎఫ్‌బీ కార్పొరేటీకరణ తర్వాత, నాణ్యమైన ఉత్పత్తిని కొనసాగించేందుకు చేసిన ప్రయత్నాలతో అంతర్జాతీయంగా పోటీపడే సామర్థ్యం పొందిన డీపీఎస్‌యూలు ఎగుమతి కేంద్రాలుగా అభివృద్ధి చెందినట్లు శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.

ప్రైవేట్ రక్షణ రంగ వ్యవస్థలో ఆరోగ్యకరమైన పోటీని పెంపొందించడం ప్రభుత్వ రంగ పురోగతికి కారణమైన లక్ష్యాల్లో ఒకటిగా పేర్కొన్న రక్షణ మంత్రి, ఇది నాణ్యత ద్వారా భారత భద్రతను బలోపేతం చేస్తుందన్నారు. "నేటి ప్రపంచంలో, కేవలం ఒక ఉత్పత్తి కంటే దాని బలమైన బ్రాండ్ విలువ ముఖ్యమైనది, సుస్థిర నాణ్యత, విశ్వసనీయతకు హామీ ఇచ్చే బ్రాండ్ మాత్రమే విజయవంతం అవుతుంది" అని ఆయన పేర్కొన్నారు.

భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామి అయిన అత్యాధునిక బ్రాండ్‌గా నిలపాలని ఈ కార్యక్రమానికి హాజరైన సాయుధ దళాలు, ప్రభుత్వ క్యూఏ ఏజెన్సీలు, డీఎస్‌పీయూలు, ప్రైవేట్ పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, విద్యాసంస్థలు అలాగే ఎమ్ఎస్ఎమ్ఈల ప్రతినిధులకు శ్రీ రాజ్‌నాథ్ సింగ్ విజ్ఞప్తి చేశారు. "బ్రాండ్ ఇండియా అంటే ఒక భారత కంపెనీ చేసిన వాగ్దానం ఏదైనా, అది కచ్చితంగా నెరవేరుతుంది. 'ఎప్పుడైనా సందిగ్ధంలో ఉంటే, భారత బ్రాండ్ ఎంచుకోండి' అనేది మన యూఎస్‌పీగా ఉండాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ప్రధాన మార్పుల గురించి రక్షణ మంత్రి మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన దేశాలు తిరిగి ఆయుధ తయారీ దిశగా అడుగులు వేసినప్పుడు, ఆయుధాలు, పరికరాలకు డిమాండ్ పెరుగుతుందని అన్నారు. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నివేదికను ఆయన ఉటంకిస్తూ, 2024లో ప్రపంచ సైనిక వ్యయం 2,718 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు పేర్కొన్నారు. సమష్టి ప్రయత్నాలతో, భారత రక్షణ తయారీ రంగం బ్రాండ్ ఇండియా స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా తనదైన ముద్ర వేయగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రక్షణరంగ ఎగుమతులు రికార్డు స్థాయిలో దాదాపు రూ. 24 వేల కోట్లను మించిపోయాయి. 2029 నాటికి వీటి విలువ రూ.50 వేల కోట్లకు పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా.. ప్రపంచంలోనే అతిపెద్ద రక్షణరంగ ఎగుమతిదారుగా భారత్‌ను నిలపాలనే లక్ష్యాన్ని సాధించడానికి, మన రక్షణ పరికరాల నాణ్యతతో ప్రపంచ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

నాణ్యతను మెరుగుపరిచేందుకు జరుగుతున్న కృషిని ప్రశంసించిన శ్రీ రాజ్‌నాథ్ సింగ్, నేటి సాంకేతికత ఆధారిత యుగంలో ఎప్పటికప్పుడు నాణ్యత పర్యవేక్షణ కోసం కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషిన్ లెర్నింగ్ వంటి సాధనాలను ఉపయోగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న ప్రపంచ సాంకేతికతలకు అనుగుణంగా ప్రమాణాలను నవీకరిస్తూ, ప్రోటోకాల్‌లను పరీక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. అవాంఛిత జాప్యాలు లేకుండా కాలపరిమితితో కూడిన నాణ్యతకు హామీ గల అనుమతులపై మనం దృష్టి సారించాలని రక్షణ మంత్రి పేర్కొన్నారు.

నాణ్యతను పరీక్షించే సంస్థలు నిరంతరం వాటి లోపాలను గమనిస్తూ ఉండాలనీ, ఆధునీకరణ, పరీక్షా మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా వాటిని అధిగమించేందుకు కృషి చేయాలని రక్షణ మంత్రి సూచించారు. సముచిత సాంకేతిక రంగంలో అంతరాలను నిరంతరం విశ్లేషించుకోవడం ఒక ముఖ్యమైన దశగా ఆయన పేర్కొన్నారు.

రక్షణ పరికరాల ఉత్పత్తి విభాగం ఆధ్వర్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ క్వాలిటీ అస్యూరెన్స్ (డీజీక్యూఏ) నిర్వహించిన ఈ సమావేశం, వారసత్వంగా వస్తున్న క్యూఏ నమూనాల నుంచి ప్రెడిక్టివ్, డేటా-ఆధారిత, ఆటోమేటెడ్ వ్యవస్థలకు మారాల్సిన అవసరాన్ని స్పష్టం చేసింది. ధ్రువీకరణ సమయాన్ని వేగవంతం చేయడానికి, తనిఖీలను క్రమబద్ధీకరించడానికి, రక్షణ ఉత్పత్తుల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి సంబంధిత విభాగాలన్నీ సమన్వయంతో సహకరించుకోవాల్సిన అవసరాన్ని నిపుణులు ప్రస్తావించారు.

రక్షణ ఉత్పత్తుల ప్రధాన ఎగుమతి కేంద్రంగా భారత్‌ను నిలిపేందుకు ఆవిష్కరణలు, పరిశ్రమ సహకారం అత్యంత కీలకమని కార్యదర్శి (రక్షణ ఉత్పత్తుల విభాగం) శ్రీ సంజీవ్ కుమార్ తెలిపారు. పారదర్శకమైన, ఇంటరాక్టివ్ ఓపెన్ హౌస్ సమావేశంలో, రక్షణ రంగ ప్రతినిధులు, యూజర్ ఏజెన్సీలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చిన ఆయన, క్యూఏ వ్యవస్థలను సరళీకృతం చేయడం, డిజిటలైజ్ చేయడం, ఆధునికీకరించాలనే మంత్రిత్వ శాఖ సంకల్పాన్ని పునరుద్ఘాటించారు.

ముఖ్యాంశాలు ఉ ప్రకటనలు

ఈ కీలక సమావేశం డీజీక్యూఏ, పరిశ్రమ భాగస్వాములు సంయుక్తంగా రూపొందించిన ఇండస్ట్రీ 4.0/క్యూఏ 4.0 రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించింది. ఇందులో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్-ఎనేబుల్డ్ టెస్ట్ బెంచ్‌లు, ఆటోమేటెడ్ డేటా క్యాప్చర్, డిజిటల్ డాష్‌బోర్డ్‌లు, ఏఐ- పవర్డ్ అనలిటిక్స్ వంటి స్మార్ట్ టెక్నాలజీల విస్తరణ గురించి చర్చించారు - మానవ తప్పిదాలను తగ్గించడం, సామర్థ్యాన్ని పెంపొందించడం, రక్షణ ఉత్పత్తుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించుటను ప్రారంభించే లక్ష్యంతో దీనిని రూపొందించారు.

తుది అభిప్రాయ సేకరణ కోసం సమావేశంలో భారత సైనిక ఎయిర్‌వర్తీనెస్ ముసాయిదా బిల్లును అధికారికంగా సమర్పించారు. ఎంవోడీ, డీఆర్‌డీవో, సేవలు, డీపీఎస్‌యూలు, పరిశ్రమ సహా బహుళ భాగస్వాముల ప్రమేయం గల సమగ్ర ప్రక్రియ ద్వారా రూపొందించిన ఈ బిల్లు, సైనిక విమానాలు, వాయుమార్గ వ్యవస్థల సర్టిఫికేషన్ కోసం ఒక చట్టబద్ధమైన విధానాన్ని ప్రతిపాదిస్తుంది. ఈ ప్రత్యేక చర్చా సమావేశం బిల్లు గురించి వినియోగదారుల ప్రతినిధులు, పరిశ్రమ ఫోరమ్‌ల తుది అభిప్రాయాన్ని సేకరించింది.

పేలుడు పదార్థాలు-ఆయుధ సామాగ్రి (ఈడవో) స్టోర్‌లను దేశీయంగా అభివృద్ధి చేసే వ్యూహాలను రూపొందించుట గురించి ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. పేలుడు పదార్థాలు-ఆయుధ సామాగ్రి ఉత్పత్తి, భద్రతా ధ్రువీకరణ, సర్టిఫికేషన్ ప్రక్రియలను ఆధునీకరించడంలో ఏఐ/ఎంఎల్, బిగ్ డేటా, అడిటివ్ మానుఫాక్చరింగ్, సిలికాన్ ఫోటోనిక్స్, సెమికండక్టర్లు, అధునాతన సామాగ్రి వంటి కొత్త సాంకేతికతల పాత్రను నిపుణులు పరిశీలించారు. కీలకమైన ఆయుధాలు, కచ్చితత్వ వ్యవస్థల్లో సాంకేతిక స్వావలంబన అవసరాన్ని ఈ సమావేశం పునరుద్ఘాటించింది.

రక్షణరంగ ఉత్పత్తుల క్యూఏ ప్రక్రియను కేవలం సమ్మతిగా మాత్రమే కాకుండా, జాతీయ భద్రత, ఎగుమతి సామర్థ్యం, స్వదేశీ ఆవిష్కరణలను వ్యూహాత్మకంగా సాధ్యం చేసే ప్రక్రియగా పునర్నిర్వచించాలనే సమష్టి నిబద్ధతను సంబంధిత ప్రతినిధులంతా సంయుక్తంగా ప్రకటించడంతో ఈ నేషనల్ క్వాలిటీ కాన్‌క్లేవ్ 2025 ముగిసింది. ఈ సమావేశ తీర్మానాలు రక్షణ రంగ ఉత్పత్తుల నాణ్యత హామీ విషయంలో భారత్ ప్రపంచస్థాయి ప్రమాణాలను నెలకొల్పుటకు ఊతమిస్తాయనే అంచనాను వ్యక్తం చేశాయి.

ఈ సమావేశం పరిశ్రమ, రక్షణరంగ ప్రతినిధుల మధ్య భాగస్వామ్యాన్ని గణనీయంగా బలోపేతం చేసిందని, నాణ్యత హామీలో నూతన ప్రమాణాలను నెలకొల్పడంతో పాటు, ఆవిష్కరణల దిశగా ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లిందని డీజీక్యూఏ డీజీ ఎన్ మనోహరన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్షన్ రియర్ అడ్మిరల్ రూపక్ బారువా, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఏరోనాటికల్ క్వాలిటీ అస్యూరెన్స్ శ్రీ సంజయ్ చావ్లా, డీపీఎస్‌యూల సిఎండీలు, సీనియర్ ఎంఓడీ అధికారులు పాల్గొన్నారు.

# జగన్ కు జడ్ ప్లస్ క్యాటగిరి సెక్యూరిటీ .. హైకోర్టులో విచారణ వాయిదా

అమరావతి, మే 9:ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ కి హైకోర్టులో నిరాశ ఎదురైంది. తనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను పునరుద్ధరించాలని, ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ ఆయన గురువారం ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం? తదుపరి విచారణను వేసవి తర్వాతకు వాయిదా వేసింది. తనకు ఉన్న ప్రాణహాని దృష్ట్యా సీఆర్‌పీఎఫ్ లేదా ఎన్ఎస్‌జీలతో సెక్యూరిటీ కల్పించాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని జగన్ అభ్యర్థించారు.

తన నివాసం, కార్యాలయం వద్ద పటిష్టమైన భద్రతతో పాటు, జామర్లు, పూర్తిస్థాయిలో పనిచేసే బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సమకూర్చాలని కోరారు. అయితే, కేంద్రం పట్టించుకోకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తనకు తగిన భద్రత కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోర్టును విన్నవించారు.

తనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను పునరుద్ధరించాలని కోరారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఎలాంటి ముందస్తు సమాచారం గానీ, నోటీసు గానీ ఇవ్వకుండా తన భద్రతను భారీగా తగ్గించేశారని జగన్ వెల్లడించారు.

# రూ. 7.85 కోట్ల విలువైన జీఎస్‌టీ ఐటీసీ మోసాన్ని ఛేదించిన ఢిల్లీ సౌత్ సీజీఎస్‌టీ అధికారులు చార్టర్డ్ అకౌంటెంట్ అరెస్టు

న్యూఢిల్లీ, మే 9:వస్తువులు, సేవల పన్ను (జీఎస్‌టీ) మోసాల గురించి సీజీఎస్‌టీ ఢిల్లీ సౌత్ కమిషనరేట్ నిర్వహించిన సోదాల్లో, దక్షిణ ఢిల్లీకి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ చేసిన (సుమారు) రూ. 7.85 కోట్ల విలువైన మోసపూరిత ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్‌ల భారీ మోసం వెలుగుచూసింది.

దర్యాప్తులో భాగంగా, చార్టర్డ్ అకౌంటెంట్ ఇమెయిల్ ఐడీలు, కాంటాక్ట్ నంబర్‌లకు అనుసంధానమై ఉన్న, ప్రధానంగా పాలం/ద్వారక ప్రాంతంలోని 80కి పైగా జీఎస్‌టీఐఎన్‌లు (వస్తువులు-సేవల పన్ను గుర్తింపు సంఖ్యలు) దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు. వాస్తవానికి వస్తువులు-సేవల సరఫరా లేకుండా సర్క్యులర్ ట్రేడింగ్ నిర్వహిస్తున్న 31 జీఎస్‌టీఐఎన్‌ల కోర్ గ్రూప్‌ను అధికారులు కనుగొన్నారు.

12 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించగా, అనేక సంస్థలు ఉనికిలోనే లేవని తేలింది. సోదాల సందర్భంగా దర్యాప్తునకు సంబంధించిన అనేక ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్న అధికారులు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను నమోదు చేశారు. జీఎస్‌టీ దాఖలు కోసం చార్టర్డ్ అకౌంటెంట్‌పై పూర్తిగా ఆధారపడుతున్నామని తెలిపిన పలువురు పన్నుచెల్లింపుదారులు, తమ లాగిన్ ఆధారాల వివరాలు, దాఖలు ప్రక్రియ అంతా ఆయనే చూసుకుంటున్నారని అంగీకరించారు.

నిందితులు చేసిన నేరాలు సీజీఎస్‌టీ చట్టం, 2017 లోని సెక్షన్ 132(1)(ఎ), 132(1)(ఇ) కిందకు వస్తాయి, ఇది సెక్షన్ 132(5) ప్రకారం విచారణార్హమైన, నాన్-బెయిలబుల్ నేరం, అలాగే చట్టంలోని సెక్షన్ 132(1)(తి) ప్రకారం శిక్షార్హమైనది.

దీని ప్రకారం, సంబంధిత చార్టర్డ్ అకౌంటెంట్‌ను సీజీఎస్‌టీ చట్టం, 2017 లోని సెక్షన్ 69(1) కింద అరెస్టు చేసి, ఈనెల 7వ తేదీన విధుల్లో ఉన్న న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు, న్యాయమూర్తి ఈనెల 21వరకు 14 రోజుల రిమాండ్ విధించడంతో సదరు చార్టర్డ్ అకౌంటెంట్‌ను జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

వంచన, ఆధారాల దుర్వినియోగం, కుట్రపూరితంగా సర్క్యులర్ ట్రేడింగ్ నిర్వహించడం ద్వారా జీఎస్‌టీ ఫ్రేమ్‌వర్క్ విషయంలో వ్యవస్థాగత దుర్వినియోగాన్ని ఈ కేసు వెల్లడించింది. ఈ మోసాన్ని గురించిన పూర్తి స్థాయి వివరాలను వెలికితీసేందుకు, అనర్హమైన ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ లబ్ధిదారులందరినీ గుర్తించడానికి సీజీఎస్‌టీ చట్టం, 2017 కింద దర్యాప్తు కొనసాగుతోంది.

# ఆలయ ప్రతిష్ట పెరిగేలా.. భక్తులు మెచ్చేలా పనిచేస్తా : ఈవో సీనా నాయక్



అమరావతి, మే 9:ఎంతో విశిష్ట చరిత్ర ఉన్న కనకదుర్గమ్మ ఆలయం అభివృద్ధితో పాటు ప్రతిష్టను మరింత పెంచే విధంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నూతన కార్యనిర్వహణ అధికారి వీకే శీనా నాయక్ తెలిపారు. విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ వారి ఆలయ నూతన ఈవోగా శుక్రవారం డిప్యూటీ కలెక్టర్ వీకే సీనా నాయక్ బాధ్యతలను స్వీకరించారు.

ఈవోగా బాధ్యతలు స్వీకరించడానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రిపై ఉన్న లక్ష్మి గణపతి ఆలయంలో కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం మండపంలో వేద పండితులు ఈవో శీనా నాయక్ కు కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనాన్ని అందజేయగా, ఆలయ అధికారులు అమ్మవారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఈవో కార్యాలయంలో ఆయన బాధ్యతలను స్వీకరించి, కుటుంబ సభ్యుల సమక్షంలో తొలి ఫైల్ పై సంతకం చేశారు.

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే ప్రతి సామాన్య భక్తుడిని విఐపి మర్యాదలతో గౌరవించి అమ్మవారి శీఘ్ర దర్శనాన్ని కల్పిస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా, అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తామన్న ఆయన, నిర్మాణాల విషయంలో ఎక్కడ రాజీ పడబోమన్నారు. గిరిజనుడైన తనకు ఇంతటి అవకాశం, బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముందుండి నడిపించి ప్రోత్సహిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం.. ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఆదిలాబాద్, మే 9: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కలమడుగులో రూ.20లక్షలతో నిర్మించిన పల్లె దవాఖాన (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ )ను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ? తమ ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. పేదల ఆరోగ్యం కోసం మరిన్ని పల్లె దవాఖానాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. జన్నారం ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వం సరఫరా చేసే మందులను క్షుణ్ణంగా పరిశీలించి, రోగులకు అందజేయాలని, కాలం చెల్లిన మందులు రోగులకు ఇచ్చినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమున్న పనులను చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అధికారులు కూడా ఆ దిశగా ప్రజల అవసరాల నిమిత్తం ముఖ్యమైన అభివృద్ధి పనుల వివరాలతో తనకు ప్రతిపాదనలు పంపించాలని ఆయన తెలిపారు.

నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకూడదని, నాసిరకం పనులు చేసినట్లయితే సహించబోనని ఆయన చెప్పారు.

# 150 పడకల ఆసుపత్రి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వాకిటి



మహబూబ్‌నగర్, మే 9:మక్తల్ పట్టణంలో రూ.50కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 150పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ఇవాళ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి పరిశీలించారు. మక్తల్ పట్టణ శివారులోని పంప్ హౌస్ వద్ద జరుగుతున్న ఆసుపత్రి నిర్మాణ పనులను ఆయన ఏఈ సాయి, కాంట్రాక్టర్ రామకృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఆసుపత్రి భవన నిర్మాణ నమూనాను పరిశీలించి నిర్మాణపనులు ఎప్పటిలోగా పూర్తవుతాయి.. వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పనులను త్వరితగతిన చేపట్టి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. నిర్ణీత సమయంలోగా నిర్మాణ పనులను పూర్తి చేసి వైద్య సేవలు అందించేందుకు అందుబాటులోకి తీసుకురావలసిందిగా అధికారులను కాంట్రాక్టర్ ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంబడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.గణేష్ కుమార్, డైరెక్టర్లు పసుల రంజిత్ రెడ్డి, సాలంబిన్ ఉమర్ బస్రవి, అంజి, కాంగ్రెస్ నాయకులు కట్ట సురేష్ కుమార్, కోళ్ల వెంకటేష్, బోయ రవికుమార్, కావలి తాయప్ప, బోయ వెంకటేష్, కట్ట వెంకటేష్, సిఎన్.వ య్యార్తి, వాకిటి శ్యామ్, తదితరులున్నారు.

# సివిల్ కాంట్రాక్టర్ గుట్ట ప్రవీణ్ గుండెపోటుతో మృతి.. ఎంపి, ఎమ్మెల్యే సంతాపం

ఆదిలాబాద్, మే 9:ఆదిలాబాద్ కు చెందిన ప్రముఖ సివిల్ ఏ-1 కాంట్రాక్టర్ గుట్ట ప్రవీణ్ (47) గుండెపోటుతో మరణించారు. గుట్ట ప్రవీణ్ గత ఆరు నెలలుగా హైదరాబాదులోని కొంపల్లి లో నివాసం ఉంటున్నాడు. రాత్రి 11 గంటలకు అకస్మాత్తుగా ఛాతిలో నొప్పితో గుండెపోటు రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. శుక్రవారం ఉదయం ప్రవీణ్ భౌతికకాయాన్ని ఆదిలాబాద్ ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కు తరలించగా కుటుంబ సభ్యులు, మిత్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రముఖ సివిల్ కాంట్రాక్టర్ గుట్ట హనుమాన్లు కుమారుడైన గుట్ట ప్రవీణ్ పిన్నవయసులోనే కాంట్రాక్టర్ గా రాణించి ఉమ్మడి జిల్లాలోనే తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నాడు.

ప్రముఖుల సంతాపం..

గుట్ట ప్రవీణ్ మృతి చెందార న్న వార్త ఆదిలాబాద్ పట్టణంలో విషాదం నింపింది. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న వివిధ పార్టీల నాయకులు, బీసీ, పద్మశాలి కుల సంఘాల ప్రతినిధులు హాజరై నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియలు సాయంత్రం 4 గంటలకు ఆదిలాబాద్ లో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

# కుటుంబ తరహా వినోద వేదిక... వేవ్స్ ఓటీటీ

న్యూఢిల్లీ, మే 9:డిజిటల్ మాధ్యమంలో ఒకే గొడుగు కింద కుటుంబ తరహా వినోదాన్నీ, అంతకు మించిన అనేక కార్యక్రమాలను అందించే ఓటీటీ వేదిక 'వేవ్స్' అని దూరదర్శన్ పనాజీ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శ్రీ సునీల్ భాటియా అన్నారు. ఆయన గురువారం (మే 8న) దూరదర్శన్ పనాజీ కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు.

భాటియా మాట్లాడుతూ... "వేవ్స్ ఒక డిజిటల్ గొడుగు కింద టెలివిజన్ ప్రత్యక్ష ప్రసారాలు, ఆన్-డిమాండ్ వీడియోలు, డిజిటల్ రేడియోలతోపాటు ఇ-కామర్స్.. ఇలా బహుముఖ కంటెంటును సమకూరుస్తుంది. యాండ్రాయిడ్, ఐఓఎస్ పరికరాలు రెండిటిలోనూ అందుబాటులో ఉన్న ఈ వేదికను కుటుంబంలో సభ్యులందరికీ వినోదం, విద్య, ఆన్‌లైన్ షాపింగ్‌లకు వన్-స్టాప్ డిజిటల్ కూడలి (హబ్)గా మలిచారు. అన్ని వర్గాల ప్రయోజనాలనూ దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ వేదిక ఉద్దేశం సాంస్కృతికంగా సంపన్నమైన భారత్ వారసత్వాన్ని అందరికీ అందించడమే" అన్నారు.

ప్రసార భారతి కిందటేడాది నవంబరులో ప్రారంభించిన ఈ వేదికలో... 12 భాషల్లో విస్తృతస్థాయిలో కంటెంటు లభ్యమవుతోంది. ఏమైనా, త్వరలో ఈ కంటెంటును కొంకణి సహ దేశంలోని అన్ని ప్రధాన భాషల్లో అందుబాటులోకి తీసుకురానున్నారని శ్రీ భాటియా తెలిపారు.

వేవ్స్ వేదికలో గోవాకు స్థానం లభించిన విషయమై శ్రీ భాటియా ప్రస్తావిస్తూ, డీడీ (దూరదర్శన్) పనాజీలో కొంకణీ భాషకు చెందిన కంటెంటు లభ్యమవుతోందన్నారు. గోవాకు చెందిన మాజీ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, భారత జాతీయ జట్టు కెప్టెన్ శ్రీ బ్రహ్మానంద్ సంఖ్‌వాల్‌కర్ జీవనం గురించి "ఫేమస్‌లీ ఫౌండ్ ఏ15" డీడీ పనాజీ రూపొందించిన ఒక డాక్యుమెంటరీ కూడా వేవ్స్ వేదికలో అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. 40 నిమిషాల పాటు సాగే ఈ డాక్యుమెంటరీలో శ్రీ సంఖ్‌వాల్‌కర్ 25 సంవత్సరాల కెరియర్‌ను వివరిస్తుంది. శ్రీ సంఖ్‌వాల్‌కర్ తనకు పదిహేను ఏళ్ల వయస్సు ఉన్నప్పుడే ఫుట్‌బాల్ ఆడడం మొదలుపెట్టారు.

వేవ్స్... 70కి పైగా లైవ్ టీవీ చానల్స్‌ను అందిస్తోంది. ఇందులో దూరదర్శన్, ఆకాశవాణి చానళ్లు, బి4యూ, ఎస్ఏబీ గ్రూపు, 9ఎక్స్ మీడియాల వంటి ప్రధాన వినోద నెట్‌వర్కులు భాగంగా ఉన్నాయి. వీటికి తోడు, ఎక్కువమంది ఆదరించిన పది ఆన్-డిమాండ్ కంటెంటు కూడా అందుబాటులో ఉంది. ఓఎన్‌డీసీతో ఏకీకరించిన కారణంగా వేవ్స్ యాప్ మాధ్యమంలో నేరుగా ఆన్‌లైన్ షాపింగ్ చేసేందుకు కూడా వీలు ఉంది.

రేడియో స్ట్రీమింగ్, వీడియో-ఆన్-డిమాండ్, ప్లే-టు-ప్లే గేమింగ్, యువతకు ప్రత్యేకించిన కంటెంటు, విభాగాల వారీ భద్రంగా సేకరించి పెట్టిన సినిమాలు, లైవ్ ఈవెంట్లు తదితర కార్యక్రమాలు ఈ మాధ్యమాన్ని ఒక అద్వితీయ, నవరివార ప్యాకేజీగా నిలబెడుతున్నాయి.

వేవ్స్‌లో చాలా వరకు కంటెంటు ఉచితంగా లభిస్తోంది. ప్రీమియం ఫీచర్లను సైతం చౌకైన సభ్యత్వ ప్లాన్లతో అందుకోవచ్చు.

విలేకరుల సమావేశంలో డీడీ పనాజీ డిప్యూటీ డైరెక్టర్ (న్యూస్) శ్రీ శశిన్ రాయ్, డీడీ పనాజీ కార్యక్రమాల విభాగం సారథి శ్రీ సవియో డీ నొరోన్హా కూడా పాల్గొన్నారు.

# దేశంలో పశువుల రవాణాను సులభతరం చేసే సరికొత్త స్మార్ట్ బోను

న్యూఢిల్లీ, మే 9:విభిన్న రకాల వాహనాలకు తగిన విధంగా అమర్చుకొనేలా అభివృద్ధి చేసిన సరికొత్త స్మార్ట్ పశువుల బోనును పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీనికి బిగించిన ర్యాంపు తలుపుగా కూడా పనిచేస్తుంది. గ్రామాల్లో జంతువులను సులభంగా రవాణా చేయడానికి ముఖ్యంగా పాడి పశువులను మార్కెట్‌కు తరలించేందుకు తోడ్పడుదుతుంది.

భారత్‌లో గ్రామాల్లో రైతుల జీవితంలో పశువులు ముఖ్యమైన భాగం. ఒక చోటు నుంచి మరో చోటుకి వాటిని తరలించడం పశువులతో పాటు, ప్రజలకూ ప్రమాదకరమే.

సాధారణంగా పశువులను సౌకర్యవంతంగా ఉండని, తెరిచి ఉంచిన, సరైన లోడింగ్ వ్యవస్థ లేని ట్రక్కుల్లో రవాణా చేస్తుంటారు. దీని వల్ల పశువులు తీవ్ర ఒత్తిడికి గురవుతాయి. వాటికి గాయాలవుతాయి. కొన్నిసార్లు ప్రాణాలు పోయే ప్రమాదాలకు గురవుతుంటాయి. ఈ పాత రవాణా పద్ధతులు రైతులకు, ట్రాన్స్‌పోర్టర్లకు ఇబ్బందులు కలిగిస్తాయి. అదే సమయంలో జంతువుల ప్రాథమిక సంక్షేమ నిబంధనలను ఉల్లంఘిస్తాయి.

మహారాష్ట్రలోని నాసిక్‌లో ఉన్న గురు గోవింద్ సింగ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ రీసెర్చి సెంటర్‌కు చెందిన ప్రొఫెసర్ సందీప్ ఎస్.పాటిల్ చేపట్టిన ఆవిష్కరణకు ఈ పరిస్థితులను మార్చే సామర్థ్యం ఉంది.

ప్రొఫెసర్ సందీప్ ఆధ్వర్యంలోని బృందం పశువులను సురక్షితంగా, సులభంగా, చౌకగా తరలించే బోనును అభివృద్ధి చేసింది. డీఎస్‌టీ-సీడ్ (సైన్స్ ఫర ఈక్విటీ, ఎంపవర్‌మెంట్, డెవలప్‌మెంట్) ద్వారా ఈ ప్రాజెక్టుకు నిధులు అందాయి.

మహారాష్ట్రలోని నాసిక్‌లో ఉన్న గురు గోవింద్ సింగ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ రీసెర్చి సెంటర్‌కు చెందిన ప్రొఫెసర్ సందీప్ ఎస్. పాటిల్, అతని బృందం

ఇది కేవలం బోను మాత్రమే కాదు, టెలిస్కోపిక్ మెకానిజం, మడతపెట్టడానికి వీలుగా ఉండే ర్యాంపులు, దృఢమైన మెటల్ ఫ్రేమ్‌లతో రూపొందించిన సైన్స్ ఆధారిత రవాణా పరిష్కారం. పశువులను తరలించే సమయంలో గాయాలు, ఒత్తిడిని తగ్గించడంతో పాటు వాటిని వాహనంలోకి ఎక్కించడం, దించడం లాంటి ప్రక్రియలను సులభతరం చేసేందుకు దీనిని రూపొందించారు.

టెలిస్కోపిక్ స్లైడింగ్ సౌకర్యం ఉన్న ఈ బోనును వాహనం సైజుకి తగినట్లుగా మార్చుకోవచ్చు. దీనిలో ఏర్పాటు చేసిన రోలర్ ద్వారా దీనిని వాహనంలో సులువుగా అమర్చుకోవచ్చు. మడత పెట్టుకోవడానికి వీలున్న ర్యాంపు పశువును వాహనంలోకి ఎక్కించేందుకు అనువుగా ఉంటుంది. ఆ తర్వాత ఈ ర్యాంపును తలుపుగా బిగించవచ్చు. పశువులకు గాలి ప్రసరించేలా దృఢమైన క్రాస్-లింక్ మెష్‌ను బిగించారు. క్షేత్ర స్థాయి సర్వేలు, రైతుల అభిప్రాయాలతో పాటు కాంప్యుటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ (సీఎఫ్‌డీ)తో పరీక్షించి గాలి ప్రసరణ సరిగా ఉండేలా ఏర్పాటు చేశారు.

రవాణా సమయంలో జంతువులకు అయ్యే గాయాలు, ఒత్తిడిని ఈ బోను తగ్గిస్తుంది. అలాగే సన్నకారు రైతులకు పశువుల తరలింపును సులభతరం చేస్తుంది. ఇది చౌకైనది, గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాలకు అనువుగా ఉంటుంది. అలాగే జంతు సంక్షేమ చట్టాలకు అనుగుణంగా ఉంటుంది. ఫలితంగా జంతువులను తరలించే సమయంలో ట్రాన్స్‌పోర్టర్లకు ఎదురయ్యే చట్టపరమైన ఇబ్బందులను తగ్గిస్తుంది. భారీ, హెవీ లోడ్ వాహనాలకు తగినట్టుగా రెండు అంతస్థుల ఆకృతిలో ఉన్న బోనును సైతం అమర్చుకోవచ్చు.

వినియోగదారులు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా పశువులను వాహనంలోకి ఎక్కించేందుకు, దించేందుకు సర్దుబాటు చేసుకోగలిగిన ర్యాంపుతో కూడిన మాడ్యులర్ కేజ్

దీన్ని డైరీలు, గోశాలలు, పశు వైద్య కార్యకలాపాల్లోనూ.. స్వల్ప దూరాలకు పశువులను తరలించేందుకు ఉపయోగించవచ్చు. తద్వారా నష్టాలను తగ్గించి శ్రమను ఆదా చేయవచ్చు. అలాగే మానవీయ రవాణా విధానాలను ప్రోత్సహించవచ్చు.

పేటెంట్లు, అకడమిక్ పబ్లికేషన్లలో ఈ డిజైన్‌కు గుర్తింపు లభించింది. మాడ్యులర్, డబుల్ ?స్టోరీ రకాలకు 2024లో రెండు భారతీయ పేటెంట్లు లభించాయి.

నాసిక్‌లోని అంబద్ గ్రామంలో ఈ ట్రాన్స్‌పోర్ట్ కేజ్‌ను పరీక్షించారు. సీఎస్ఆర్ నిధులు, విస్తృత అమలు ప్రయత్నాల ద్వారా ఈ ప్రాజెక్టును విస్తరించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# రూ.10లక్షల విలువైన గంజాయి పట్టివేత

## -20.6 కేజీల గంజాయి, కారు స్వాధీనం..




సంగారెడ్డి, మే 9:మహారాష్ట్ర ఔరంగబాద్‌లోని ఒక కంపెనీలో అపరేటర్‌గా పని చేస్తున్న వ్యక్తి వస్తున్న జీతం సరిపోవడం లేదని గంజాయి వ్యాపారంలోకి దిగాడు. రెండేళ్లుగా ఉద్యోగంతో పాటు గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. 2023లో ఒకమారు గంజాయి రవాణా చేస్తూ అబుల్లాపూర్ మెట్‌లో ఒకసారి పట్టుబడ్డాయి. ఈ కేసులో జైలుకు కూడా వెళ్లివచ్చాడు. ఐనా గంజాయి వ్యాపారం కొనసాగిస్తున్న జలీలోద్దీన్ సిద్ధిఖి అహ్మమద్ హుస్సెన్ మరోమారు గంజాయిని తరలిస్తూ ఎస్టిఎఫ్ ఏ టీమ్ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన ఘటన వెలుగులోకి వచ్చింది.

జలీలోద్దీన్ సిద్ధిఖి అహ్మమద్ హుస్సెన్ అనే వ్యక్తి సీలేరు నుంచి గంజాయిని తీసుకొని మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో అమ్మకాలు సాగిస్తూ ఉంటాడు. లక్ష్మీబాయి అనే మహిళ వద్ద 20.6 కేజీల గంజాయిని తీసుకొని జాతీయ రహదారి 65లో సంగారెడ్డి పోతురెడ్డిపల్లిలోని పల్లవి అపార్ట్‌మెంట్ ప్రాంతంలో కారులో వెళ్తుండగా గంజాయిని ఎస్టి ఎఫ్ ఏ టీమ్ లీడర్ అంజిరెడ్డి టీమ్, సిబ్బంది పట్టుకున్నారు. ఈ కేసుల్లో గంజాయిని కొనుగోలు చేసి అమ్మకాల కోసం తీసుకెళున్న జలీలోద్దీన్ సిద్దిఖి అహ్మమద్ హుస్సెన్, గంజాయి అమ్మకాలు జరిపిన లక్ష్మీబాయి, కృష్ణ కొన అనే వ్యక్తులపై కేసు నమోదు చేశారు. కారు, గంజాయిలను స్వాధీనం చేసుకొని, నిందితుడు జలీలోద్దీన్ సిద్దిఖి అహ్మమద్ హుస్సెన్ అరెస్టు చేసి సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్టి ఎఫ్ ఏ టీమ్ లీడర్ అంజి రెడ్డి తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు.

# షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం.. భారీగా నష్టం

నిజామాబాద్, మే 9:జుక్కల్ మండల కేంద్రంలో గురువారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ తో భవాని క్లాత్ స్టోర్ షాపు దగ్ధమైంది. తెల్లవారుజామున ఆ దుకాణం నుండి పొగలు రావడంతో కొందరు వాహనదారులు ఈ విషయాన్ని గమనించి స్థానికులకు, వస్త్ర దుకాణం యజమాని ఉప్లాంచే శంకర్ కు తెలియజేశారు. ఈలోగా షాప్ షెటర్ల నుండి మంటలు ఎగసిపడటంతో స్థానికులు బట్టల షాప్ షెటర్లను తొలగించారు.

మద్నూర్ మండల కేంద్రంలో గల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. మద్నూర్ నుండి అగ్నిమాపక వాహనం వచ్చే లోపే దాదాపు లక్షల రూపాయల విలువ చేసే విలువైన బట్టలు, 25వేల రూపాయల నగదులతో పాటు లక్షలాది రూపాయలు వెచ్చించి తయారు చేయించిన ఫర్నీచర్ మొత్తం దగ్ధమైంది. మంటలు ఇతర దుకాణాలకు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది శ్రమించి ఆర్పేశారు. పెండ్లి సీజన్ కావడంతో లక్షల విలువైన స్టాక్ తెప్పించటం జరిగిందని, ఆ స్టాక్ ఘట్టాలు కూడా విప్పకముందే షార్ట్ సర్క్యూట్ తో దుకాణం కాలిపోయి భారీ నష్టం వాటిల్లడంతో తాము రోడ్డున పడ్డామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఉప్లాంచే శంకర్ వేడుకుంటున్నారు.

# ల్యాండ్‌మైన్ బ్లాస్ట్ - ముగ్గురు పోలీసులు దుర్మరణం

వరంగల్, మే 9:తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మరోసారి మావోయిస్టుల ఉనికిని గుర్తుచేసే విషాద ఘటన చోటుచేసుకుంది. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడులో ముగ్గురు పోలీసులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళితే, మావోయిస్టులు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నారన్న ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు, భద్రతా దళాలు తెల్లవారుజాము నుంచే కూంబింగ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ సమయంలో మావోయిస్టుల తాకిడి ఎదురవ్వగా, ఇరువర్గాల మధ్య తీవ్ర కాల్పులు చోటుచేసుకున్నాయి.

ఈ దాడిని పక్కాగా ప్లాన్ చేసిన మావోయిస్టులు,పోలీసులను ల్యాండ్ మైన్ ఉన్న ప్రదేశానికి దారి మళ్లించి, అతి తక్కువ సమయంలోనే దాన్ని పేల్చేశారు. పేలుడులో ముగ్గురు పోలీసులకు తీవ్ర గాయాలు కావడంతో, వారు స్పాట్‌లోనే మరణించారు. ఈ ఘటన నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలన చేస్తున్నారు.

# రోడ్ల పరిస్థితి అధ్వాన్నం.. పట్టించుకోని ప్రజాప్రతినిధులు

హైదరాబాద్, మే 9:వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేఆర్ చౌరస్తా వద్ద రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. వికారాబాద్ నుండి తాండూరు వెళ్లే మార్గంలో గల ఈ బీజేఆర్ చౌరస్తా వద్ద గత కొన్ని నెలలుగా రోడ్డు పరిస్థితి ఇలాగే ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు కానీ, ప్రజాప్రతినిదులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు.

జిల్లా కేంద్రం పరిస్థితి ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందోనన్న అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీజేఆర్ వద్ద రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రతి వ్యక్తికి ఆధ్యాత్మిక చింతన అవసరం.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



హైదరాబాద్, మే 9:నేటి సమాజంలో జీవించే ప్రతి వ్యక్తికి ఆధ్యాత్మిక చింతన అత్యవసరమైనదని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మోమిన్ పేట మండల పరిధిలోని సయ్యదలిపూర్ గ్రామంలోని హనుమాన్ మందిరంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన, నవగ్రహ ప్రతిష్ఠాపన, నాభిశిలా (బొడ్రాయి) దాన్యాదివాసము, జలాధివాసము వంటి కార్యక్రమాలను వేద బ్రాహ్మణోత్తముల చేత వేదమంత్రాలతో నిర్వహించారు.

ఈకార్యక్రమంలో రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామమైన సయ్యదలి పూర్ గ్రామంలో ప్రజలకు ఇంత ఆధ్యాత్మిక చింతన ఉండడం నిజంగా గ్రామ ప్రజలు అదృష్టవంతులన్నారు. నేటి ఆధునిక సమాజంలో ఎన్నో సమస్యలు, మానసిక ఒత్తిళ్ళు ఉన్న సమయంలో ఆధ్యాత్మిక చింతనతో ఇలాంటి దైవ కార్యక్రమాలు నిర్వహించడం గ్రామానికి శుభ సూచకమన్నారు.

ఈకార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నర్సోత్తం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సుభాష్ గౌడ్, మాణయ్య, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సురేందర్, ఎరాజ్, సుభాష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బంటు వెంకటేశం, సయ్యదలిపూర్ గ్రామ పార్టీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, నారాయణ రెడ్డి, అంజిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, గ్రామపెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థం ప్రసాదాలు స్వీకరించారు.

# విశిష్ట సేవారత్న అవార్డు గ్రహీత దామల్ల సత్యం

- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాఘమై,హైమావతి చేతుల మీదుగా అవార్డు పురస్కారం
- విశిష్ట సేవారత్న అవార్డు గ్రహీత దామల్ల సత్యనారాయణ, రామారావు,




ఖమ్మం, మే 9 (నేటినిజం ప్రతినిధి) :హ్యూమన్ రైట్ చైర్మన్ హైమావతి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట చేతుల మీదుగా అవార్డు అందుకొని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాఘమై పాల్గొని అవార్డులు అందించి ఇంకా సమాజంలో సేవలు అందించాలని వారు కోరినారు.

మానవ హక్కుల పరిరక్షణ ప్రజా సమితి ఆధ్వర్యంలో సత్తుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు చలమల హైమావతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సమాజంలో వివిధ రంగాల్లో సేవలు అందించినదుకు వారి సంఘం ఆధ్వర్యంలో విశిష్ట సేవా రత్న అవార్డు ప్రకటించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న అవార్డు గ్రహీత విశిష్ట సేవా రత్న అవార్డు గ్రహీత తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దామల్ల సత్యనారాయణ వారికి వారి సంఘం కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసినారు.

కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షులు కొప్పుల రామారావు కూడా అవార్డు అందుకొని వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# రోడ్డుప్రమాదం.. ఇద్దరు యువకులు మృతి

వరంగల్, మే 9:మితిమీరిన వేగంతో బైకు వెనుక నుంచి మరో బైకును ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో జాతీయ రహదారి 365 పై జరిగింది. ఎస్ఐలు బి.అంజయ్య,బి.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ మండలంలోని బాబోజిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని భోజ్య తండాకు చెందిన గుగులోతు కార్తీక్(22), వెంకురాం తండాకు చెందిన భూక్య సంతోష్(19) ఇద్దరు మిత్రులు. వీరితో పాటుగా అదే జీపీలోని వాగు ఒడ్డు తండాకు చెందిన అజ్మీర సుధీర్ మరిపెడ మండల కేంద్రానికి వారి వారి బైకులపై వస్తున్నారు.

కార్తీక్, సంతోష్ ఒకే బైకుపై ఉండగా సుధీర్ వెనుక మరో బైకుపై వస్తున్నాడు. ఈ క్రమంలో మరిపెడ మండల కేంద్రంలోని బంగ్లా మరిపెడ క్రాస్ రోడ్ వద్ద సుధీర్ బైకు వెనుక నుంచి కార్తీక్ బైకును వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కార్తీక్, సంతోష్ లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, సుధీర్ తలకు బలమైన గాయాలవడంతో తొలుత మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం కు తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజమ్మ, సతీష్ తెలిపారు.

# భారత సైన్యం ప్రదర్శించిన తీరుకు భారతీయుడిగా గర్వపడుతున్నాను

## - దేశ రక్షణలో సైనికుల పాత్ర వెలగట్టలేనిది

ఖమ్మం, మే 9 (నేటినిజం ప్రతినిధి) :కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పరికపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...ఉగ్రవాదం ఉన్మాదం ఏ రూపంలో ఉన్న ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే తప్ప లాభం చేకూర్చేది కాదని ఉగ్రవాదం ఎప్పటికైనా అంతం కావాల్సిందేనని పరికపల్లి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాదుల నిర్మూలనే లక్ష్యంగా భారత సాయుద ధళాలు జరుపుతున్న దాడులను చూస్తుంటే చాలా గర్వంగా ఉన్నదని ఆయన అన్నారు. పహల్గం ఉగ్ర దాడుల్లో అమాయక దేశ ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఆ బాధతో దేశం కన్నీరు పెట్టిందని ఆయన గుర్తు చేశారు.

ఆ దాడికి ప్రతి కారంగా దేశ సాయుధ దళాలు ఉగ్రవాదుల స్థావరాల నిర్మూలనకు ఆపరేషన్ సింధూర్ పేరుతో తమదైన శైలిలో దాడులకు పాల్పడడం చూసి దేశ ప్రజలు సంతోషిస్తున్నారని ఆయన అన్నారు. కానీ నాటి నుంచి నేటి వరకు దేశ రక్షణలో సైనికుల పాత్ర వెలగట్టలేనిదని సాయుధ దళాల పోరాట పటిమ దేశ ప్రజలకు గర్వకారణమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో చేపట్టిన దాడులతో ఉగ్రవాదం పూర్తిస్థాయిలో కనుమరుగు కావాలని ఆయన తెలిపారు.

# పరిశ్రమ-విద్యా సంబంధాల బలోపేతానికి కొత్తగా అయిదు అత్యాధునిక రీసెర్చ్ పార్కులు

న్యూఢిల్లీ, మే 9:ఆంధ్రప్రదేశ్ (ఐఐటి తిరుపతి), కేరళ (ఐఐటి పలక్కడ్), ఛత్తీస్‌గఢ్ (ఐఐటి భిలాయి), జమ్మూ కాశ్మీర్ (ఐఐటి జమ్మూ), కర్ణాటక (ఐఐటి ధార్వాడ్) లలో ఏర్పాటైన అయిదు కొత్త ఐఐటీలలో విద్య, మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని విస్తరించేందుకు (ఫేజ్-బి నిర్మాణం) ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఇందుకోసం 2025-26 నుంచి 2028-29 వరకు నాలుగేళ్ల కాలానికి రూ.11,828.79 కోట్లు ఖర్చు చేస్తారు.

ఈ ఐఐటీలలో 130 ఫ్యాకల్టీ పోస్టుల (ప్రొఫెసర్ స్థాయిలో అంటే లెవల్ 14, అంతకంటే ఎక్కువ) ఏర్పాటుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

పరిశ్రమలు-విద్యా సంబంధాల బలోపేతానికి కొత్తగా అయిదు అత్యాధునిక రీసెర్చ్ పార్కులను కూడా ఏర్పాటు చేస్తారు.

ఇందులో భాగంగా, వచ్చే నాలుగు సంవత్సరాల్లో ఈ ఐఐటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ), పీహెచ్ డి కోర్సుల్లో విద్యార్థుల సంఖ్య 6500కిపైగా పెరిగే అవకాశం ఉంది. మొదటి సంవత్సరంలో 1364 మంది, రెండో సంవత్సరంలో 1738 మంది, మూడో సంవత్సరంలో 1767 మంది, నాలుగో సంవత్సరంలో 1707 మంది విద్యార్థుల చొప్పున సంఖ్య పెరగనుంది.

లబ్ధిదారులు

నిర్మాణం పూర్తయిన తర్వాత, ప్రస్తుత విద్యార్థుల సంఖ్య 7,111 ఉన్న ఈ అయిదు ఐఐటీల్లో మొత్తం 13,687 మంది విద్యార్థులకు విద్యను అందించే సామర్థ్యం కలిగి ఉంటాయి. అంటే విద్యార్థుల సంఖ్య మరో 6,576 పెరుగుతుంది. ఈ సీట్ల పెంపుతో, దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ విద్యాసంస్థల్లో చదవాలన్న 6,500కిపైగా విద్యార్థుల ఆకాంక్షలు నెరవేరతాయి. నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని సృష్టించడం, సృజనాత్మకతను ప్రోత్సహించడం, ఆర్థిక వృద్ధిని పెంచడం ద్వారా ఇది దేశ నిర్మాణానికి దోహదపడుతుంది. సామాజికంగా కూడా ఇది మొబిలిటీని మెరుగుపరచి విద్యా అసమానతలను తగ్గిస్తుంది. అంతర్జాతీయంగా భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

ఉపాధి కల్పన

పెరిగిన విద్యార్థుల సంఖ్య, సౌకర్యాల నిర్వహణకు అనుగుణంగా అధ్యాపకులు, పరిపాలనా సిబ్బంది, పరిశోధకులు, సహాయక సిబ్బంది నియామకాలతో ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అలాగే, ఐఐటి క్యాంపస్ ల విస్తరణ, గృహ నిర్మాణం, రవాణా, ఇతర సేవలకు డిమాండును సృష్టించడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థలకు ఊతమిస్తుంది. ఐఐటీల నుంచి గ్రాడ్యుయేట్లు, పోస్ట్‌గ్రాడ్యుయేట్ల సంఖ్య పెరగడం వల్ల ఆవిష్కరణలు, స్టార్టప్ వ్యవస్థలు మరింత శక్తిమంతమవుతాయి. ఇది వివిధ రంగాల్లో ఉద్యోగావకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

రాష్ట్రాలు - జిల్లాలు

ఈ అయిదు ఐఐటీలు... ఆంధ్రప్రదేశ్ (ఐఐటి తిరుపతి), కేరళ (ఐఐటి పలక్కడ్), ఛత్తీస్ ఘఢ్ (ఐఐటి భిలాయ్), జమ్మూ కాశ్మీర్ (ఐఐటి జమ్మూ), కర్ణాటక (ఐఐటి ధార్వాడ్) రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్నాయి. కాగా, ఐఐటీల్లో ప్రవేశాలు దేశవ్యాప్తంగా (పాన్-ఇండియా) ఆధారంగా జరిగే కారణంగా, ఈ విస్తరణ దేశంలోని అన్ని రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలకు ప్రయోజనం చేకూరుస్తుంది.

2025-26 బడ్జెట్

గత పదేళ్లలో 23 ఐఐటీల్లో విద్యార్థుల సంఖ్య 65 వేల నుంచి 1.35 లక్షలకు వంద శాతం పెరిగింది. 2014 తర్వాత ప్రారంభమైన అయిదు ఐఐటీల్లో అదనపు మౌలిక వసతులు కల్పించి మరో 6,500 మంది విద్యార్థులకు విద్యను అందించనున్నారు.

నేపథ్యం

ఆంధ్రప్రదేశ్ (ఐఐటి తిరుపతి), కేరళ (ఐఐటి పలక్కడ్), ఛత్తీస్ ఘఢ్ (ఐఐటి భిలాయ్), జమ్మూ కాశ్మీర్ (ఐఐటి జమ్మూ), కర్ణాటక (ఐఐటి ధార్వాడ్) రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ అయిదు కొత్త ఐఐటిలు ఏర్పాటయ్యాయి. 2015-16లో పలక్కాడ్, తిరుపతిలోని 2015-16లో పాలక్కాడ్, తిరుపతిలోని ఐఐటీల అకడమిక్ సెషన్ ప్రారంభం కాగా, మిగిలిన మూడు ఐఐటీలు 2016-17లో తాత్కాలిక క్యాంపస్ నుంచే ప్రారంభమయ్యాయి. ఈ ఐఐటీలు ఇప్పుడు వాటి శాశ్వత క్యాంపస్ ల నుంచి పనిచేస్తున్నాయి.

# గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన ప్రధాని

న్యూఢిల్లీ, మే 9:గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు.

భారత దేశ సాహిత్య, సంస్కృతీ పరమైన ఆత్మను తీర్చిదిద్దిన గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సదా స్మరించుకుంటామని శ్రీ మోదీ అన్నారు. ఆయన రచనలు మానవత్వానికి ప్రాధాన్యమిచ్చాయని, అదే సమయంలో ప్రజల్లో జాతీయవాద స్ఫూర్తిని రగిలిస్తాయని శ్రీ మోదీ తెలిపారు.

"గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు. భారతీయ సాహిత్యం, సంస్కృతుల ఆత్మను తీర్చిదిద్దిన ఆయన ఎప్పటికీ గుర్తుంటారు. ఆయన రచనలు మానవత్వానికి ప్రాధాన్యమిచ్చాయి. అదే సమయంలో ప్రజల్లో జాతీయవాద స్ఫూర్తిని రగిలిస్తాయి. శాంతి నికేతన్‌ను ఆయన ఎలా తీర్చిదిద్దారో పరిశీలిస్తే.. విద్య, అభ్యాసం విషయంలో ఆయన చేసిన కృషి సైతం స్ఫూర్తిదాయకం".

# మిల్లుల వద్ద ధాన్యం దిగుమతిలో జాప్యానికి తావులేకుండా చర్యలు.

## -రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశం.

## జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.



సంగారెడ్డి మే 09 (నేటి నిజం ప్రతినిధి)రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకోవడంలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు.

రైతుల నుండి సేకరించిన ధాన్యాన్నివెంటదివెంట నిర్దేశిత మిల్లులకు తరలించడంతో పాటు, తక్షణమే మిల్లుల వద్ద అన్ లోడింగ్ జరిగేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు.

కొండాపూర్ మండలం, గొల్లపల్లి గ్రామంలో పీఏసీఎస్ ద్వారా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, గోడౌన్, జిల్లా కలెక్టర్ శుక్రవారం సందర్శించారు.

కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతులను పలకరించి, ధాన్యం అమ్మకం విషయంలో ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు.

కంద్రాలకు ఎప్పుడు ధాన్యం తీసుకువచ్చారు, ఎన్ని రోజులకు తూకం జరిగింది, కేంద్రాల నిర్వాహకులు సహకరిస్తున్నారా, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

ఆయా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాల రికార్డులను పరిశీలించారు.

అకాల వర్షాలు కురుస్తున్నందున రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలతో కూడిన వాహనాలు ఎక్కువ సమయం పాటు నిలిచి ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకుని నిలువ చేసుకునేందుకు వీలుగా అందుబాటులో ఉన్న గోడౌన్లను గుర్తించాలని, హమాలీలు, లారీల కొరత నెలకొనకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా సరిపడా సంఖ్యలో టార్పాలిన్లు సమకూర్చుకోవాలని అన్నారు.

జిల్లాలో రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలిస్తున్నందున కొనుగోలు ప్రక్రియలో ఎక్కడ కూడా జాప్యం జరుగకుండా చూడాలన్నారు.

రైతులు ఇబ్బందులకు గురికాకూడ దని, నిర్ణీత గడువు లోపు ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేలా అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలని హితవు పలికారు. ధాన్యం దిగుమతులు కొనుగోలు కేంద్రాలకు వస్తున్నందున వెంటదివెంట ధాన్యం సేకరణ జరుపుతూ, మిల్లుల వద్ద అన్ లోడింగ్ లో జాప్యం జరుగకుండా చర్యలు తీసుకోవాలనిఅధికారులనుఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ రవీందర్ రెడ్డి, పి ఎ సి ఎస్ డై రెక్టర్ లు, రెవెన్యూ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తమపై దాడికి గట్టి జవాబు చెప్పేందుకు ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తన 'ప్రతిస్పందించే హక్కు'ను ఉపయోగించుకుంది: రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, మే 9:"ఆపరేషన్ సిందూర్ ద్వారా, భారత్ తమ గడ్డపై జరిగిన దాడికి బదులిచ్చేందుకు తన 'ప్రతిస్పందించే హక్కు'ను ఉపయోగించుకుంది.. పాకిస్తాన్, పీఓకేలో ఉగ్రవాదుల శిక్షణ శిబిరాలను నాశనం చేయడానికి సాయుధ దళాలు కచ్చితత్వం, ముందుజాగ్రత్త, మానవత్వంతో వ్యవహరించి సరికొత్త చరిత్రను లిఖించాయి" అని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఈరోజు ఢిల్లీ కంటోన్మెంట్‌లోని మానెక్‌షా సెంటర్‌లో జరిగిన బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) 66వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రణాళిక ప్రకారం లక్ష్యాలను నాశనం చేశామనీ, ఈ దాడిలో సాధారణ పౌరులకు ఎలాంటి హాని జరగలేదని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉగ్రవాదులకు తగిన సమాధానం ఇచ్చిన సాయుధ దళాలను ఆయన ప్రశంసించారు.

"మన సాయుధ దళాలు ఈరోజు ఏమి చేశాయో ప్రపంచమంతా చూసింది. ఈ చర్య చాలా ఆలోచనాత్మకంగా, ప్రణాళికకు అనుగుణంగా జరిగింది. ఉగ్రవాదుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసే లక్ష్యంతో, వారి శిక్షణ శిబిరాలు, ఇతర మౌలిక సదుపాయాలకే ఈ దాడులు పరిమితం అయ్యాయి. యావత్ దేశం తరపున నేను మన సాయుధ బలగాలను అభినందిస్తున్నాను. దళాలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చి వారిలో మరింత స్థైర్యాన్ని నింపిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీని కూడా నేను అభినందిస్తున్నాను" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఓకు చెందిన వ్యూహాత్మక ప్రాముఖ్యం గల 30 వంతెనలు, 17 రహదారులు అలాగే మూడు ఇతర ప్రాజెక్టులు సహా మొత్తం 50 మౌలికవసతుల ప్రాజెక్టులను రక్షణ మంత్రి జాతికి అంకితం చేశారు. మొత్తం రూ. 1,879 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టులు ఆరు సరిహద్దు రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, మిజోరం, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్‌లతో పాటు రెండు కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూ కశ్మీర్, లదాఖ్‌లలో విస్తరించి ఉన్నాయి. ఇవి మారుమూల ప్రాంతాల్లో భారత భద్రతను, కనెక్టివిటీని, అభివృద్ధిని బలోపేతం చేయనున్నాయి. గడిచిన రెండేళ్ల కాలంలోనే, రికార్డు స్థాయిలో రూ. 5,600 కోట్ల విలువైన 161 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను బీఆర్ఓ పూర్తి చేసింది, వీటిలో గత ఏడాది పూర్తయిన 111 ప్రాజెక్టులు ఉన్నాయి. గత నాలుగేళ్లలో మొత్తం రూ. 13,743 కోట్ల వ్యయంతో 456 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను బీఆర్ఓ పూర్తి చేసింది.

ఈరోజు వీడియో అనుసంధానం ద్వారా ప్రారంభించిన ఈ ప్రాజెక్టులు కనెక్టివిటీని పెంపొందిస్తాయని, జాతీయ భద్రతను బలోపేతం చేస్తాయని అలాగే ఈ ప్రాంతాల ఆర్థిక శ్రేయస్సును ప్రోత్సహిస్తాయని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ విశ్వాసం వ్యక్తం చేశారు. "ఈ ప్రాజెక్టులు రక్షణపరంగా సంసిద్ధతను పెంపొందించడంతో పాటు ఈ ప్రాంతాల్లో రవాణా, పర్యాటక, ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిస్తాయన్నారు. ఇవి కేవలం మౌలిక సదుపాయాల ఆస్తులు మాత్రమే కాదు.. ఇవి ఉజ్వల భవిష్యత్తుకు మార్గాలు" అని ఆయన వ్యాఖ్యానించారు.

బీఆర్ఓ పనుల వ్యూహాత్మక ప్రాముఖ్యతను వివరిస్తూ, ఆధునిక రక్షణ సామర్థ్యం కేవలం ఆయుధాలపైనే కాకుండా దానికి మద్దతు ఇచ్చే మౌలిక సదుపాయాలపై కూడా ఆధారపడి ఉంటుందని రక్షణ మంత్రి తెలిపారు. "మీరు అత్యంత వేగవంతమైన ట్యాంక్ లు.. అత్యంత అధునాతన విమానాలను కలిగి ఉండవచ్చు, కానీ అవి అవసరమైన చోటికి సమయానికి చేరుకోలేకపోతే, వాటి వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. మన సైన్యం ఎల్లప్పుడూ సిద్ధంగా, సరైన సన్నద్ధతతో ఉండేలా నిర్ధారించడంలో బీఆర్ఓ కీలక పాత్ర పోషిస్తుంది," అని వ్యాఖ్యానించిన రక్షణ మంత్రి, తెరవెనుక అలుపెరగని కృషితో జాతీయ భద్రతకు దోహదపడే బీఆర్ఓ కర్మయోగులను ప్రశంసించారు.

ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా సాయుధ దళాలకు కొత్త తరం మౌలిక సదుపాయాలను నిర్మించాల్సిన అవసరం ఉందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. బీఆర్ఓ సన్నాహాలు యుద్ధ స్థాయిలో ఉండేలా చూసుకోవాలని ఆయన సూచించారు.

సరిహద్దు ప్రాంత అభివృద్ధి పట్ల ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన రక్షణ మంత్రి, వ్యూహాత్మక ప్రాముఖ్యం గల ప్రాంతాల్లో కనెక్టివిటీని పెంపొందించే సంకల్పానికి నిదర్శనంగా నిలిచే సెలా సొరంగ మార్గాన్ని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. సరిహద్దు గ్రామాల అభివృద్ధి విషయంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను వివరించిన ఆయన, వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్ వంటి కార్యక్రమాల కింద ప్రభుత్వం ప్రతిరోజూ 35 కిలోమీటర్ల రహదారులను నిర్మిస్తూ కనెక్టివిటీని పెంచుతోందని తెలిపారు.

డైరెక్టర్ జనరల్ బోర్డర్ రోడ్స్ (డీజీబీఆర్) లెఫ్టినెంట్ జనరల్ రఘు శ్రీనివాసన్ మాట్లాడుతూ, నానాటికీ పెరుగుతున్న బీఆర్ఓ జాతీయ ప్రాముఖ్యతను వివరించారు. అత్యంత సవాలుతో కూడిన భూభాగాల్లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అమలు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వంలోని కీలక మంత్రిత్వ శాఖల ప్రాధాన్య ఎంపిక ఏజెన్సీగా ఈ సంస్థ ఆవిర్భవించిందని ఆయన పేర్కొన్నారు. జీఆర్ఈఎఫ్ సిబ్బంది, సాధారణ వేతన కార్మికులు సహా తమ సిబ్బంది శ్రేయస్సు, గౌరవం పట్ల బీఆర్ఓ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు.

పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల మంత్రి శ్రీ కిరణ్ రిజిజు, శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన, ప్రధానమంత్రి కార్యాలయ సిబ్బంది శిక్షణ వ్యవహారాల, అణుఇంధన, అంతరిక్ష శాఖల సహాయమంత్రి (స్వతంత్ర హోదా) డాక్టర్ జితేంద్ర సింగ్, ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, రక్షణశాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్, రక్షణ మంత్రిత్వ శాఖలోని ఇతర సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా, అరుణాచల్ ప్రదేశ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ కైవల్య త్రివిక్రమ్ పర్నాయక్, రాజస్థాన్ గవర్నర్ శ్రీ హరిభావ్ కిషన్‌రావ్ బాగ్డే, అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ పెమా ఖండూ, మిజోరాం ముఖ్యమంత్రి శ్రీ లాల్దుహోమా, జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ మనోజ్ సింహా, లెఫ్టినెంట్ గవర్నర్ లదాఖ్ బ్రిగేడియర్ (డాక్టర్) బిడి మిశ్రా (రిటైర్డ్)లు వీడియో అనుసంధానం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పరమ పవిత్రులు పోప్ లియో XIVకు ప్రధానమంత్రి శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, మే 9:పరమ పవిత్రులు పోప్ లియో చీఎఎ కు భారతదేశ ప్రజల పక్షాన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన హృదయపూర్వక అభినందనలతోపాటు శుభాకాంక్షలను తెలిపారు. కేథలిక్ చర్చికి పోప్ అందిస్తున్న నాయకత్వాన్ని శ్రీ మోదీ హర్షించారు. ప్రపంచంలో శాంతినీ, సద్భావననూ, సంఘీభావాన్నీ, సేవనూ వ్యాప్తి చేయడంలో కేథలిక్ చర్చికి విస్తృత ప్రాధాన్యం ఉందని ప్రధాని అన్నారు.

ఎక్స్‌లో ప్రధానమంత్రి ఒక సందేశాన్ని పొందుపరుస్తూ ఆ సందేశంలో :పరమ పవిత్రులు పోప్ లియో చీఎఎ కు భారతదేశ ప్రజల తరఫున నేను హృదయపూర్వక అభినందనలతోపాటు శుభాకాంక్షలను తెలియజేస్తున్నాను. శాంతి, సద్భావన, సంఘీభావం, సేవ.. ఈ ఆదర్శాలను ముందుకు తీసుకుపోవడంలో కేథలిక్ చర్చి ప్రాధాన్యాన్ని సంతరించుకొన్న వేళ, నాయకత్వ బాధ్యతలను ఆయన స్వీకరించారు. ఉమ్మడి విలువలను పెంపొందింప చేయడానికి హోలీ సీ తో తరచుగా సంభాషించడంతోపాటు అనుబంధాన్ని బలపరచుకోవడానికి భారత్ సదా కట్టుబడి ఉంటుంది.

# మహారాణా ప్రతాప్ జయంతి... ప్రధానమంత్రి నివాళులు

నల్గొండ, మే 9:పరాక్రమశాలి, యోధుడు మహారాణా ప్రతాప్ జయంతి ఈ రోజు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

ఎక్స్‌లో శ్రీ మోదీ ఒక సందేశాన్ని పొందుపరుస్తూ:

"దేశ అమర సేనాని మహారాణా ప్రతాప్‌నకు ఆయన జయంతి సందర్భంగా కోటానుకోట్ల వందనాలు. మాతృభూమి గౌరవాన్ని సంరక్షించడానికి ఆయన ప్రదర్శించిన ధైర్య సాహసాలు, శౌర్యం ఈనాటికీ మన వీరులకు, వీరాంగనలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. భారత మాతకు అంకితమైన ఆయన పరాక్రమ భరిత జీవనం దేశ ప్రజలకు సదా ప్రేరణను ఇస్తూ ఉంటుంది" అని పేర్కొన్నారు.

# భారత సైన్యం ప్రదర్శించిన తన సైనిక పాటవానికి ఒక భారతీయుడుగా నేను గర్వపడుతున్నా

**-తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్ రావు**

హైదరాబాద్ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );'భారత సైన్యం ప్రదర్శించిన తన సైనిక పాటవానికి ఒక భారతీయుడుగా నేను గర్వపడుతున్నాను. ఉగ్రవాదం, ఉన్మాదం ఏరూపంలో వున్నా, ఏ దేశంలో వున్నా ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే తప్ప లాభం చేకూర్చేదికాదు. ఉగ్రవాదం అంతం కావాల్సిందే' అని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్ రావు అన్నారు. ఈ విషయంలో పాజిటివ్‌గా ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకమై, ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతి సామరస్యాలు నెలకొంటాయని తెలిపారు.

భారత సైన్యం ఎంత విరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా వుండి దేశ రక్షణలో మేమెవరికి తీసిపోము అన్నట్టుగా వారికి శక్తి సామర్థ్యాలుండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

# పాక్‌కు గట్టి షాక్.. లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ధ్వంసం చేసిన భారత్

న్యూ ఢిల్లీ మే 9 (ఎక్స్ ప్రెస్ న్యూస్);పాకిస్థాన్‌కు భారత్ మరోసారి గట్టి షాకిచ్చింది. పాక్ గగనతల రక్షణ వ్యవస్థలపై భారత సైన్యం విరుచుకుపడింది. ప్రతీకార దాడులకు ప్రయత్నించిన దాయాది దేశానికి కోలుకోలేని దెబ్బ కొట్టింది.పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' ను విజయవంతంగా చేపట్టిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారంగా భారత్‌లోని 15 నగరాల్లోని సైనిక స్థావరాలపై పాకిస్థాన్ దాడులు చేసేందుకు ప్రత్నించించింది. బుధవారం రాత్రి, ఇవాళ తెల్లవారుజామున భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో దాడులకు పాక్ ప్రయత్నించినట్లు రక్షణ శాఖ తెలిపింది. అయితే, ఆ దాడులను భారత బలగాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయి.జమ్ము కశ్మీర్, పంజాబ్, గుజరాత్, శ్రీనగర్, పఠాన్‌కోట్, అమృత్‌సర్, లూథియానా, చండీగఢ్ సహా ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లోని భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని పాక్ దాడులకు ప్రయత్నించినట్లు తెలిపింది. వీటిని సమర్థవంతంగా అడ్డుకున్నట్లు పేర్కొంది. పాక్ మిస్సైళ్లను గగనతలంలోనే పేల్చేసినట్లు వెల్లడించింది. ఈ క్రమంలోనే లాహోర్ లోని ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ధ్వంసమైనట్లు తెలిపింది. పాకిస్థాన్ వైమానిక రక్షణ రాడార్లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని ధ్వంసం చేసినట్లు రక్షణ శాఖ తెలిపింది. హార్పీ డ్రోన్స్ ను ఉపయోగించి పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను నిర్వీర్యం చేసినట్లు ప్రకటించింది.

# విద్యుత్ రంగానికి బొగ్గు కేటాయింపు కోసం సవరించిన శక్తి (భారత్‌లో పారదర్శకంగా బొగ్గు వినియోగం, కేటాయింపు పథకం విధానానికి మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ, మే 9:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ- కేంద్ర ప్రభుత్వ రంగ/ రాష్ట్ర ప్రభుత్వ రంగ/ స్వతంత్ర విద్యుదుత్పత్తిదారులకు చెందిన థర్మల్ విద్యుత్ ప్లాంట్లకు తాజాగా బొగ్గు కేటాయింపులకు (కోల్ లింకేజీలు) ఆమోదం తెలిపింది. సవరించిన శక్తి విధానం కింద ఈ రెండు విండోలను ప్రతిపాదించారు:

జాయింట్ వెంచర్లు, వాటి అనుబంధ సంస్థలు సహా కేంద్ర రంగంలోని థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు బొగ్గు కేటాయింపు (కోల్ లింకేజీ) కోసం ప్రస్తుతమున్న విధానం కొనసాగుతుంది.

విద్యుత్ మంత్రిత్వ శాఖ సిఫార్సుల మేరకు రాష్ట్రాలకు, రాష్ట్రాల బృందం ద్వారా ఏర్పడిన ఏజెన్సీకి ప్రస్తుత విధానం ప్రకారం బొగ్గు సరఫరాను కేటాయించాలి. రాష్ట్రాలకు కేటాయించిన బొగ్గు లింకేజీని రాష్ట్రాలు తమ సొంత జెన్ కోలో వినియోగించుకోవచ్చు. టారిఫ్ ఆధారిత పోటీ వేలం (టీబీసీబీ) ద్వారా స్వతంత్ర విద్యుదుత్పత్తిదారులను (ఐపీపీ) గుర్తించాలి. లేదా కొత్త విస్తరణ యూనిట్ ఏర్పాటు కోసం విద్యుత్ చట్టం- 2003లోని సెక్షన్ 62 కింద విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) ఉన్న ప్రస్తుత స్వతంత్ర విద్యుదుత్పత్తి దారులను గుర్తించాలి.

పీపీఏ ఉన్న ఏదైనా దేశీయ బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిదారు లేదా విడి, దిగుమతి చేసుకున్న (వాటికి అవసరమైతే) బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లు నోటిఫై చేసిన ధర కన్నా ఎక్కువ ప్రీమియం చెల్లించడం ద్వారా 12 నెలల వరకు లేదా అంతకన్నా ఎక్కువ కాలం (25 సంవత్సరాల వరకు) వేలం ప్రాతిపదికన బొగ్గును పొందవచ్చు. ఇది విద్యుత్ ప్లాంట్లు తమకు నచ్చిన విధంగా విద్యుత్‌ను విక్రయించుకునే వెసులుబాటు కల్పిస్తుంది.

పై నిర్ణయాల అమలు కోసం కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్)/ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్)లకు ఆదేశాలు జారీ చేయనున్నారు. అంతేకాకుండా సంబంధిత విభాగాలు / ఆధీకృత సంస్థలు, నియంత్రణ కమిషన్లకు తెలియజేసేలా, సవరించిన శక్తి విధానంపై సంబంధిత మంత్రిత్వ శాఖలు, అన్ని రాష్ట్రాలకు కూడా సమాచారాన్ని అందించాలి.

ఉపాధి కల్పన సామర్థ్యం, ఇతర ముఖ్య ప్రభావాలు:

లింకేజీ ప్రక్రియ సరళీకరణ: శక్తి విధానానికి సవరణల ద్వారా, బొగ్గు కేటాయింపు కోసం ప్రస్తుతమున్న ఎనిమిది పేరాలను సులభతర వాణిజ్యం స్ఫూర్తితో కేవలం రెండు విండోలకు కుదించారు. విండో-ఎ (ప్రకటించిన ధరలకు బొగ్గు కేటాయింపు), విండో-ఎవి (ప్రకటించిన ధర కన్నా ఎక్కువ ప్రీమియం ధరకు బొగ్గు కేటాయింపు).

విద్యుత్ రంగంలో పెరుగుతున్న బొగ్గు అవసరాలను తీర్చడం: విద్యుత్ ప్లాంట్లు తమ దీర్ఘకాలిక/ స్వల్పకాలిక డిమాండును బట్టి బొగ్గు అవసరాలను తీర్చుకునేలా ప్రణాళికలు వేసుకోవడానికి సవరించిన శక్తి విధానం వీలు కల్పిస్తుంది.

కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సిఫారసు మేరకు కేంద్ర ప్రభుత్వ రంగ థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు నామినేషన్ ప్రాతిపదికన బొగ్గు కేటాయింపు కొనసాగుతుంది. విద్యుత్ మంత్రిత్వ శాఖ సిఫారసు మేరకు నామినేషన్ ప్రాతిపదికన రాష్ట్రాలకు కేటాయించిన లింకేజీలను రాష్ట్రాలు తమ ఉత్పత్తి సంస్థల్లో ఉపయోగించుకోవచ్చు.

విండో-2లో పీపీఏ అవసరం లేదు: విండో-2 కింద సేకరించిన బొగ్గు ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును విక్రయించేందుకు పీపీఏ అవసరాన్ని పూర్తిగా తొలగించారు. తద్వారా విద్యుత్ ప్లాంట్లు తమకు నచ్చిన విధంగా విద్యుత్‌ను విక్రయించుకునే వెసులుబాటు కల్పించారు.

స్వతంత్ర విద్యుదుత్పత్తిదారులు/ ప్రైవేటు డెవలపర్లకు థర్మల్ సామర్థ్యాన్ని పెంపొందించుకునే అవకాశాన్ని కల్పించడం: 12 నెలల నుంచి 25 సంవత్సరాల వరకు కాలపరిమితితో పీపీఏతో లేదా పీపీఏ లేకుండా.. సామర్థ్యాన్ని పెంచుకునేలా అనువైన లింకేజీకి అవకాశం కల్పించారు. కొత్తగా థర్మల్ సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి స్వతంత్ర విద్యుదుత్పత్తి సంస్థలను ప్రోత్సహిస్తుంది. ఇది భవిష్యత్తులో థర్మల్ సామర్థ్యాన్ని పెంచుకోవడంలో సహాయపడుతుంది.

బొగ్గు దిగుమతుల తగ్గింపు/ ప్రత్యామ్నాయాలకు ప్రోత్సాహం: దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత ప్లాంట్లు వాటి సాంకేతిక పరిమితులకు లోబడి విండో-ఎవి కింద దేశీయంగా బొగ్గును సేకరించుకోగలవు. తద్వారా అవి దిగుమతిపై ఆధారపడడం తగ్గుతుంది. దిగుమతి బొగ్గు ప్రత్యామ్నాయం వల్ల కలిగే ప్రయోజనాలను తగిన నియంత్రణ కమిషన్ నిర్ణయించి, విద్యుత్ వినియోగదారులు/లబ్ధిదారులకు అందిస్తుంది.

'పిట్ హెడ్' విద్యుత్ ప్లాంట్లకు ప్రాధాన్యం: సవరించిన శక్తి విధానం ప్రస్తుత ప్లాంట్ల విస్తరణకు దోహదపడడంతోపాటు ప్రధానంగా పిట్ హెడ్ ప్రాంతాల్లో, అంటే బొగ్గు గనుల ప్రాంతాలకు సమీపంలో కొత్తగా థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటును ప్రోత్సహిస్తుంది.

సరఫరా హేతుబద్ధీకరణ: థర్మల్ విద్యుత్ ప్లాంటుకు బొగ్గుకు సంబంధించిన 'పూర్తి వ్యయాన్ని (ల్యాండెడ్ కాస్ట్)' తగ్గించే లక్ష్యంతో.. బొగ్గు వనరుల హేతుబద్ధీకరణ చేపడతారు. ఇది రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే కాకుండా, అంతిమంగా విద్యుత్ వినియోగదారులకు సుంకాలనూ తగ్గిస్తుంది.అధికారిక ప్రాతినిధ్యం: విధానంలో సంబంధిత మంత్రిత్వ శాఖల (బొగ్గు, విద్యుత్ శాఖలు) స్థాయిలో స్వల్ప మార్పులకు వీలుగా అధికారాల బదలాయింపు కోసం సవరించిన శక్తి విధానం వీలు కల్పిస్తుంది. అంతేకాకుండా నిర్వహణ/ అమలు అంశాలకు సంబంధించి విద్యుత్, బొగ్గు శాఖల కార్యదర్శులు, సీఈఏ ఛైర్‌పర్సన్లతో కూడిన ఓ 'సాధికారిక కమిటీ'ని ఇది ప్రతిపాదించింది.

ప్రస్తుత ఇంధన సరఫరా ఒప్పందాలకు (ఎఫ్ఎస్ఏ) వెసులుబాటు: విండో-2 కింద బొగ్గు వార్షిక ఒప్పంద పరిమాణం (ఏసీక్యూ)లో 100 శాతానికి మించి ప్రస్తుత ఇంధన సరఫరా ఒప్పందాలున్న సంస్థలు భాగస్వామ్యం వహించడం ద్వారా విద్యుదుత్పత్తిదారులకు ప్రయోజనం కలుగుతుంది. పాత విధానాల కింద పొందిన బొగ్గు కేటాయింపుల గడువు ముగిసిన తర్వాత.. విద్యుదుత్పత్తిదారులు (కేంద్ర జెన్ కోలు, రాష్ట్ర జెన్ కోలు, స్వతంత్ర విద్యుదుత్పత్తిదారులు) ప్రస్తుత ప్రతిపాదిత సవరించిన విధానం కింద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

విద్యుత్ మార్కెట్లలో మిగులుకు అవకాశం: కేటాయించిన బొగ్గు ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తును విద్యుత్ మార్కెట్లలో విక్రయించడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఇది విద్యుత్ ఎక్స్ఛేంజీలలో విద్యుత్ లభ్యతను పెంచడం ద్వారా మార్కెట్లను బలోపేతం చేయడం మాత్రమే కాకుండా, ఉత్పత్తి కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా చేస్తుంది.

థర్మల్ విద్యుత్ ప్లాంట్లు, రైల్వేలు, కోల్ ఇండియా లిమిటెడ్ / సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, తుది వినియోగదారులు, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రయోజనం కలుగుతుంది.

2017లో శక్తి విధానాన్ని ప్రవేశపెట్టడంతో.. నామినేషన్ ఆధారితంగా నడిచే వ్యవస్థ నుంచి వేలం/ టారిఫ్ ఆధారిత బిడ్డింగ్ ద్వారా మరింత పారదర్శక విధానం దిశగా బొగ్గు కేటాయింపులో సమూలమైన మార్పు వచ్చింది. కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వ రంగ విద్యుత్ ప్లాంట్లకు మాత్రమే నామినేషన్ ఆధారిత కేటాయింపులు కొనసాగాయి. మంత్రుల బృందం సిఫార్సుల మేరకు 2019లో శక్తి విధానాన్ని సవరించారు. 2023లో దీనిని మరింత సవరించారు. అర్హత ప్రమాణాలకు లోబడి వివిధ కేటగిరీల విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు లింకేజీని కేటాయించడానికి శక్తి విధానంలో అనేక పేరాలు ఉన్నాయి. శక్తి విధానానికి సవరణలతో.. బొగ్గు కేటాయింపు కోసం అందులో ఉన్న ఎనిమిది పేరాలను సులభతర వాణిజ్య స్ఫూర్తితో రెండు విండోలకే పరిమితం చేశారు.

# సైబర్ నేరగాళ్ల నయా దందా అప్రమత్తంగా ఉండాలన్న సజ్జనార్

హైదరాబాద్, మే 9: దేశ సరిహద్దుల్లో ఉద్రికత్త నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు కొత్త దందాకు తెరలేపారు. ఈ దందా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ ఎండీ, సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ సూచించారు. ఈ మేరకు తన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఆర్మీ అధికారులమని చెప్పుకుంటూ అమాయక ప్రజలకు సందేశాలు పంపుతూ, విరాళాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇలాంటి నకిలీ ఆర్మీ అధికారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు.

ఎలాంటి వివరాలు ఇవ్వొద్దు!

ఎవరైనా ఆర్మీ అధికారి పేరుతో డొనేషన్ అడిగితే వెంటనే అనుమానించాలని, ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని సజ్జనార్ స్పష్టం చేశారు. ఒకవేళ అనుమానాస్పద సందేశాలు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. దేశభక్తిని అడ్డుపెట్టుకుని అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఇలాంటి సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యం. ఎలాంటి విరాళాలు ఇవ్వాలన్నా అధికారిక ప్రకటనలు చూసి, ధ్రువీకరించుకున్న తర్వాతే స్పందించాలని ఆయన సూచించారు.

# ఆపరేషన్ సిందూర్: ఉగ్రవాద శిబిరాలపై ఖచ్చితత్వంతో భారతీయ సాయుధ దళాల దాడి

న్యూఢిల్లీ, మే 9:భారతీయ సాయుధ దళాలు కొద్దిసేపటి కిందట 'ఆపరేషన్ సిందూర్' పేరుతో...పాకిస్తాన్, పాక్ ఆక్రమిత జమ్మూ, కాశ్మీర్‌లోని ఉగ్రవాద కేంద్రాలపై దాడులు నిర్వహించాయి. భారత్‌పై దాడి చేయడానికి ఉగ్రవాదులు పథక రచన చేసింది

ఈ ప్రాంతాల్లోనే. మొత్తం తొమ్మిది (9) ప్రాంతాలపై భారతీయ సాయుధ దళాలు దాడులు నిర్వహించాయి.

తమ లక్ష్యాల్లో పాకిస్తానీ సైన్యానికి చెందిన ఎలాంటి ప్రాంతాలూ లేవు. లక్ష్యాలపై దాడి నిర్వహణలోనూ, లక్ష్యాలను గుర్తించడంలోనూ- భారత్ తగినంత నిగ్రహాన్ని పాటించింది. పహల్గామ్‌లో చోటుచేసుకున్న ఘోరమైన ఉగ్ర దాడుల్లో 25 మంది భారతీయులు, ఒక నేపాలీ మరణించారు. ఈ మరణాలకు ప్రతి చర్యగానే ఈ దాడులు జరిగాయి. పహల్గామ్ దాడికి కారణమైన వారిని బాధ్యులు చేయాలన్న మా సంకల్పానికి కట్టుబడి ఉన్నాం. 'ఆపరేషన్ సిందూర్' కి సంబంధించిన వివరాలను మరికొద్ది సేపట్లో వెల్లడిస్తాం

